రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

ఈ ఐదు రోజులే కీలకం

★4, 5 తేదీల్లో రుతుపవనాలు ★ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం అప్రమత్తం ★యంత్రాంగాన్ని పరుగులు పెట్టిస్తున్న కలెక్టర్లు ★వేగవంతమైన తూకాలు- లారీల కొరత నివారణకు చర్యలు

మూడుచింతలపల్లి మండలం కొల్తూర్‌లో రైస్ మిల్లును తనిఖీచేస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

శామీర్‌పేట (మేడ్చల్ జిల్లా ప్రతినిధి), మే 29 ప్రభాతవార్త: రాష్ట్రంలోకి జూన్ 4, 5వ తేదీల్లో రుతుపవనాలు ప్రవేశించనున్న నేపథ్యంలో, ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై ప్రభుత్వం అత్యంత అప్రమత్తమైంది. జూన్ 4వ తేదీ లోపలే ధాన్యం, మక్కల కాంటాలు (తూకాలు) పూర్తిగా ముగిసేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించడంతో క్షేత్రస్థాయిలో అధికారులు తమ పనిని మరింత వేగవంతం చేశారు. రానున్న ఈ ఐదు రోజులను ఒక సవాలుగా స్వీకరిస్తూ జిల్లా కలెక్టర్లు కొనుగోలు కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ధాన్యపు రవాణాను వేగవంతం చేసేందుకు అవసరమైతే ఇసుక లారీలను కూడా వాడుకోవడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. దీనితో పాటు ధాన్యం తరలింపు, రైతులకు నగదు చెల్లింపుల ప్రక్రియను వెంటనే పూర్తి చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

వర్షాల ముప్పు ఉంది.. టార్పాలిన్లను సిద్ధం చేయండి

ఈ ఏర్పాట్లలో భాగంగా మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి శుక్రవారం మూడుచింతలపల్లి మండల పరిధిలోని కొల్లూర్ (కొల్తూర్) గ్రామంలో ఉన్న రైస్ మిల్లును ఆకస్మికంగా సందర్శించారు. వివిధ కొనుగోలు కేంద్రాల నుండి మిలుకు వస్తున్న వరిధాన్యం బస్తాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో కల్పిస్తున్న వసతులు, సేకరించిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించడానికి ఏర్పాటు చేసిన వాహనాల వివరాలపై ఆయన అధికారులను ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు, నీడ వంటి కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. నిబంధనల ప్రకారం కొనుగోళ్లను వేగవంతం చేస్తూ, సకాలంలో తూకాలు పూర్తి చేయాలన్నారు. తూకం పూర్తయిన వెంటనే ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు రవాణా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వర్షాల ముప్పు ఉన్నందున టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర రైతులకు దక్కేలా అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని కోరారు. ఈ ఆకస్మిక తనిఖీ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి మేనేజర్ సుగుణా బాయి, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ బిక్షంలతో పాటు రెవెన్యూ సిబ్బంది, కొనుగోలు కేంద్రాల, మిల్లుల నిర్వాహకులు మరియు రైతులు పాల్గొన్నారు.

రవాణాలో సహకరించండి

వెహికిల్ అసోసియేషన్‌కు కలెక్టర్ విజ్ఞప్తి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారీ

వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త : ధాన్యం నిల్వలు ఎక్కువకాలం కొనుగోలు కేంద్రాల్లో ఉండకుండా త్వరితగతిన తరలించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి, జిల్లా అధికారులతో కలిసి వరి కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం రవాణా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం తరలింపులో ఎదురవుతున్న సమస్యలు, వాహనాల లభ్యత, రవాణా ఛార్జీలు, సమయపాలన తదితర అంశాలపై చర్చించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని సరిపోవు వెహికిల్‌లను ఏర్పాటు చేసి త్వరితగతిన మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రవాణా ప్రక్రియలో సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సహకరించాలని వెహికిల్ అసోసియేషన్ సభ్యులను కోరారు. తాండూర్, కొడంగల్ మండలాలో వాహనాలను ఏర్పాటు చేసి వరి కొనుగోలులో లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో తాండూర్ డిఆర్ఓ అనిత, డిఆర్‌డిఓ శ్రీనివాస్, ట్రాన్స్ పోర్ట్ అధికారి సురేందర్ రెడ్డి, జీఎం మహేశ్వర్, సివిల్ సప్లై అధికారులు మోహన్ కృష్ణ, సుదర్శన్, మిల్లర్లు, వెహికిల్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో కలెక్టర్ తనిఖీ

యాలాల, మే 29, ప్రభాతవార్త: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని స్టాక్ పాయింట్లకు చేరవేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్, యాలాల గ్రామాల్లో పర్యటించి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంను వెంటనే మిల్లర్లకు, స్టాక్‌పాయింట్లకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చౌరస్తాలోని బాలాజీ రైస్ మిల్లు యజమాన్యాలతో కలెక్టర్ మాట్లాడారు. మిల్లుల్లో ధాన్యం నిల్వలకు అవకాశం లేకుంటే స్టాక్ పాయింట్లకు చేరవేయాలన్నారు. అనంతరం యాలాల మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్‌లో ధాన్యం కొనుగోలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. గన్నీ బస్తాల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. అనంతరం యాలాలలో కొనసాగుతున్న జనగననలో చేపడుతున్న స్వీయ గణన ప్రక్రియను పరిశీలించారు. ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా అవసరమైతే పక్క జిల్లాలకు తరలించాలని, లారీల కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కస్తూర్భా గాంధీ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు డిఇఒ, ఎంపిడిఒ, ఎమ్మార్వోలతో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



యాలాల రైస్ మిల్లు యజమానితో మాట్లాడుతున్న కలెక్టర్ తివారీ

బాధితుల వేదన ఇదీ..

- మండలంలోని అన్నారం గ్రామంలో ఎకరం భూమిని వాసత్వపు హక్కు కింద రికార్డులలో నమోదు చేసుకునేందుకు రూ.1.50లక్షల లంచం డిమాండ్ చేసినట్లు ఓ రైతు వాపోయాడు.
- మరో గ్రామానికి చెందిన మహిళా రైతు చనిపోయింది. అమె పేరిట ఉన్న రెండు ఎకరాల భూమిని తనపేరిట మార్పు చేయాలని కుమార్తె దరఖాస్తుచేసుకుంది. రూ.4లక్షలు ఇస్తేనే పని అవుతుందని అధికారులు సంకేతం ఇవ్వడంతో ఆర్థిక స్థోమత లేక ఓ ప్రజాప్రతినిధిని ఆశ్రయించినట్లు సమాచారం. ఆయన ఫోన్ చేస్తే విరాసత్ చేసేందుకు అధికారులు సిద్ధమైనట్లు బాధితురాలు మీడియాకు వివరించింది.
- టేకుల్‌కోడ్ తండాకు చెందిన గిరజన రైతు పేరున నాలుగు గుంటల భూమి ఉంది. ఆ భూమిని భార్య పేరిట మార్పిడి కోసం అర్జీ పెట్టుకున్నాడు. రూ.10వేల కోసం ఆరు నెలల పాటు తిప్పించుకున్నారు.
- కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలో ఓ వ్యక్తి తన పిల్లలకు సంబందించి జనన ధృవపత్రాలు కావాలని కోరారు. ఒక్కొక్కరికి రూ.8వేల చొప్పున నలుగురికి రూ.24వేలు డిమాండ్ చేశారని సమాచారం. నెలల తరబడి తిరిగినా కనికరించకపోవడంతో గుట్టుచప్పుడు కాకుండా రూ.16వేలు ముట్టచెప్పి పనిపూర్తి చేయించుకున్నారని తెలుస్తోంది.

ఎవరా ముగ్గురు?

కొడంగల్ తహసీల్దార్ కార్యాలయంలో లంచావతారం

కొడంగల్, మే 29, ప్రభాతవార్త : సాక్షాత్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గం అది. సిఎం సెగ్మెంట్ అంటే స్థానిక పాలనా వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలి. సిఎం ఎంత ఒత్తిడిగా ఉన్నా... తాను ప్రాతినిధ్యం వహించే కొడంగల్‌పై స్పెషల్ ఫోకస్ పెడుతూనే ఉన్నారు. నియోజక అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తూ ప్రగతిపథంలో పరుగులు పెట్టించటానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడి పాలనా వ్యవహారాలలో ఏ చిన్న తేడా వచ్చినా ఎప్పుడోకప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి వెళుతుందన్న భయం ప్రభుత్వ సిబ్బందిలో కనిపించాలి. మరోవైపు ప్రతి శాఖలోనూ పారదర్శకత ఉండాలనీ, జవాబుదారీతనంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలనీ, ప్రజల అర్జీలు పరిష్కరించటంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఉన్నతాధికారులు ప్రతి వారం జరిగే ప్రజావాణిలో హెచ్చరిస్తూనే ఉంటున్నారు. అయినా క్షేత్రస్థాయిలో కొంతమంది సిబ్బంది ప్రవర్తనలో ఏమాత్రం మార్పు రావడం లేదని బాధితుల ఆరోపణ. తాజాగా పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనుల సమీక్షలో నగర ప్రథమ పౌరుడు అయిన మున్సిపల్ ఛైర్మన్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తంచేన సంగతి తెలిసిందే. కొంతమంది అలక్ష్యం కారణంగా పాలకులకు చెడ్డపేరు వస్తోందని ఆవేదన వ్యక్తంచేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఇక కొడంగల్ తహసీల్దార్ కార్యాలయం విషయానికి వస్తే కొంతమంది లంచావతారులతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. ఏ పని కావాలన్నా ఎంతోకొంత ముట్టజెప్పాల్సిందే. రెండు ఎకరాల భూమి వారసత్వ భూమి రికార్డుకు గాను రూ.3లక్షలు డిమాండ్ చేశారని ఇటవల ఓ బాధితుడు రోడ్డెక్కారు. ఇక్కడ మనిషి పుట్టిన..చచ్చిన కొంతమంది సిబ్బందికి పండగే. ఎందుకంటే జనన మరణ ధృవీకరణ పత్రం కోసం రెవెన్యూ గడప తొక్కాల్సిందే కాబట్టి. అలా వచ్చిన దరఖాస్తుదారులు రూ.8వేలు సమర్పించుకుంటేనే ధృవీకరిస్తారు. లేదంటే నెలల తరబడి కార్యాలయం అరాచకాలు తహసీల్దార్ దృష్టికి 'రాకపోవడం'లో నిజమెంతో పమాత్ముడికే తెలియాలని స్థానికులు పేర్కొంటున్నారు. కార్యాలయంలో 'పైసా వసూల్' ఆరోపణలపై తహసీల్దార్ రాంబాబును ప్రభాతవార్త కలిసింది. బాధితుల గోడును ఆయన దృష్టికి తీసుకువెళ్లగా... కార్యాలయంలో ఎవ్వరు డబ్బులు అడిగినా ఇవ్వరాదని, నేరుగా తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రస్తుతం పని ఒత్తిడి వల్ల సిబ్బందిపై దృష్టి సారించలేకపోయానని, ఎవరు తప్పు చేసినా విడిచి పెట్టేది లేదని స్పష్టం చేశారు. కార్యాలయంలో ముఖ్యంగా ఓ ముగ్గురిపై ఎక్కువగా ఆరోపణలు వస్తున్నాయని, సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని స్వయంగా తహసీల్దారే చెప్పడం కొసమెరుపు.

ఇక్కడ పుట్టినా..చచ్చినా సిబ్బందికి పండగే

మామూళ్లిస్తేనే ధృవీకరణ పత్రం

వారసత్వ భూమి రికార్డుల్లో మార్చాలంటే లక్షలు ఇచ్చుకోవాల్సిందే

ఏ పనికి వెళ్లినా మనీ ఇస్తేనే..

లేదంటే నెలల తరబడి తిరగాల్సిందే..

పని ఒత్తిడి వల్ల సిబ్బందిపై దృష్టి పెట్టలేకపోయానంటున్న తహసీల్దార్

ఎవరు తప్పు చేసినా విడిచి పెట్టేది లేదని స్పష్టీకరణ

ముఖ్యంగా ఓ ముగ్గురిపై ఆరోపణలు ఎక్కువగా ఉన్నాయని వెల్లడి

విచారణ చేసి చర్యలు తీసుకుంటామని బాధితులకు హామీ

- మున్సిపాలిటీకి చెందిన ఎండీ అమ్ముజాహీ అనే మహిళ చనిపోయింది. డెత్‌సర్టిఫికెట్ కోసం ఆమె కోడలు గౌసియాబేగం గత ఏడాది ఫిబ్రవరి 8న దరఖాస్తు చేశారు. నేటికి మరణ ధృవపత్రం ఇవ్వలేదని బాధితురాలి ఆరోపణ.
- మున్సిపాలిటీ పరిధిలో అబేదాబేగం అనే మహిళ ఈఏడాది మార్చిలో మృతిచెందింది. అమె పేరున బ్యాంకు ఖాతాలో రూ.12వేలు ఉన్నాయి. డబ్బులు తీసుకోవాలంటే ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్ కావాలని బ్యాంకు అధికారులు మెలికపెట్టారు. దీని కోసం తహసీల్దార్ కార్యాలయంలో 15 రోజుల క్రితం దరఖాస్తు చేశారు. రేపు మాపు అంటూ రోజూ కార్యాలయం చుట్టూ తిప్పించుకున్నారని.. ఇటీవల ఎట్టకేలకు ఆమె పని పూర్తి చూస్తూ..ప్రతిఫలంగా కొని ఇవ్వాలని ఓ అధికారి డిమాండ్ చేసినట్టు తెలిసింది. ఈ వ్యవహారంలో తీవ్ర అసహనానికి గురైన బాధితులరాలు అధికారుల తీరుపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

శ్రీమంతుడు రావాలి

మహేష్‌బాబు దత్తత గ్రామస్తుల పిలుపు

ఆయన తలుచుకుంటే డంపింగ్ యార్డ్ ఆగిపోతుంది

గ్రీన్ ట్రిబ్యునల్ వరకు పోరాటాన్ని తీసుకెళ్లాలని సిద్ధాపూర్ వాసుల నిర్ణయం

1న చలో కలెక్టరేట్ విజయవంతానికి సన్నాహాలు

మాట్లాడుతున్న డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ ఎమ్మెస్ సత్యనారాయణ

కొత్తూర్, మే 29, ప్రభాతవార్త: తన తెలుగు బ్లాక్‌బస్టర్ శ్రీమంతుడు సినిమా కథ స్ఫూర్తితో, సమాజానికి తిరిగి సేవ చేయాలనే చొరవలో భాగంగా తెలంగాణలోని సిద్ధాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకోనున్నట్లు సూపర్‌స్టార్ మహేష్ బాబు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ గ్రామ అభివృద్ధికి మహేష్‌బాబు తన ఫౌండేషన్ ద్వారా సహాయం అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మహేష్‌బాబు పేరును సిద్ధాపూర్ గ్రామస్తులు తెరమీదకు తీసువచ్చారు. ఆయన దత్తత తీసుకున్న సిద్ధాపూర్‌కు ఊహించని విపత్తు వచ్చిందని పేర్కొంటూ 'శ్రీమంతుడు' రంగంలోకి దిగి తమకు అండగా నిలవాలని కోరుతున్నారు. సిద్ధాపూర్‌లో డంప్ యార్డ్ ప్రతిపాదనకు వ్యతిరేకంగా కొత్తూరు పట్టణంలోని పాపిరస్ రిసార్ట్‌లో గ్రామస్తులు అంతా శుక్రవారం సమావేశ మయ్యారు. ఈ సందర్భంగా పెంజర్ల సర్పంచ్ మరియు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ, సిద్ధాపూర్ గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసిన సినిమా హీరో మహేష్ బాబు ఇప్పుడు డంపింగ్ యార్డ్ సమస్యపై స్పందించాలని కోరారు. మహేష్ బాబు తలుచుకుంటే డంపింగ్ యార్డ్ ఆగిపోవడం పెద్ద విషయం కాదు అని వ్యాఖ్యానించారు. ప్రాంతంలో భూములు కొనుగోలు చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పెద్ద రైతులు కూడా ప్రజలతో కలిసి ఉద్యమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకునేందుకు అన్ని రాజకీయ పార్టీలు, గ్రామాల ప్రజలు కలిసికట్టుగా పోరాడాలని కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మండల అధ్యక్షుడు ఎల్లారం శేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. డంపింగ్ యార్డ్ వ్యవహారంపై ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూర్తి సహకారం అందిస్తున్నారని, ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా ఎలాంటి నిర్ణయాలు అమలు చేయరని తెలిపారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటైతే రాజీనామా చేస్తా అని ఎమ్మెల్యే స్పష్టం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ అంశంపై బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెస్ సత్యనారాయణ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. సిద్ధాపూర్ భూముల కొనుగోలు సమయంలో ప్రజల తరపున పోరాటం చేసినప్పుడు బీఆర్ఎస్ నాయకులు ఎక్కడ ఉన్నారు? అని ప్రశ్నించిన శేఖర్ రెడ్డి, ఇది ఒక్క సిద్ధాపూర్ సమస్య మాత్రమే కాదని, పరిసర గ్రామాల ప్రజల భవిష్యత్తుకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అంబటి ప్రభాకర్ మిగతా 3లో

పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించండి

3

బిజెపి శ్రేణులకు కిషన్ రెడ్డి పిలుపు

ప్రజా ఫిర్యాదులపై మరింత స్పందన

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్

3

ఈవీఎం గోదాను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఈవీఎంల భద్రతలో నిర్లక్ష్యం వద్దు

వికారాబాద్, ప్రభాతవార్త : తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న బ్యాలట్ యూనిట్లు, పోస్టల్ బ్యాలెట్లు భద్రపరచిన గోదామును జిల్లా కలెక్టర్ దీపక్ తివారి శుక్రవారం పరిశీలించారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, బ్యాలట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీప్యాట్ యంత్రాలు, పోస్టల్ బ్యాలెట్ల భద్రతా ఏర్పాట్లను కలెక్టర్ సమీక్షించారు. రికార్డుల నిర్వహణ, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిరక్ష్యానికి తావు లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గోదాంలో పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు నిరంతరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ అధికారులు, నేమత్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

ఉపాధి, పెన్షన్ కూడా ఇవ్వండి

రెవెన్యూ అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, మే 29, ప్రభాతవార్త : ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసుల బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించటం దేశంలోనే చారిత్రాత్మకమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్సీ,ఎస్టీ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. దీనిలో రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మెంబర్ జిల్లా శంకర్‌తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్లు పైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగ జరిగిన

మాట్లాడుతున్న పైజాన్ అహ్మద్

సమావేవేంలో మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ పైజాన్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి నెల 25వ తేదీన తహీసల్దార్లు తప్పనిసరిగా సివిల్‌రైట్స్‌డే సమావేశాన్ని నిర్వహించాలని ఆదేశించారు. సివిల్ రైట్స్‌డే కార్యక్రమాలకు అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను త్వరితగతిన మిగతా 3లో

కవరులో నవజాత శిశువు మృతదేహం

నాగారం వద్ద మురికికూపంలో లభ్యం

కీసర, మే 29, ప్రభాతవార్త: కళ్ళు కూడా తెరవని ఒక పసికందును ప్లాస్టిక్ కవరులో పెట్టి మురికికూపంలో వదిలేసిన ఉదంతమింది. పుట్టి ఒక్క రోజు కూడా గడవకముందే ఆ చిన్నారి లోకాన్ని విడిచిపోగా, కుళ్లిన స్థితిలో ఉన్న ఆ మృతదేహం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ హృదయవిదారక సంఘటన ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ విజయపురి కాలనీ దోభీఘాట్ ప్రాంతంలో చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులు ఒకటి లేదా రెండు రోజుల వయస్సు ఉన్న ఓ నవజాత మగ శిశువును ఓ తెల్లటి ప్లాస్టిక్ కవరులో చుట్టి అక్కడ పడేసి వెళ్ళిపోయారు. ఎండ తీవ్రతకు ఆ మృతదేహం కుళ్ళిపోయి, అక్కడి నుండి తీవ్రమైన దుర్వాసన రావడం ప్రారంభమైంది. గమనించిన స్థానిక నివాసి తిరుమల శెట్టి సోమరాజు వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే కీసర పెట్రోల్ మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్లాస్టిక్ కవరును తెరిచి చూడగా అందులో అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహం కనిపించింది.

మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయం : ఎమ్మెల్యే కృష్ణారావు

కెపిహెచ్‌బి కాలనీ, మే 28, ప్రభాతవార్త

కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధిలోని భరత్ నగర్ హెచ్.ఐ.జి వద్ద 14 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న నూతన పైప్లైన్ నిర్మాణ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు విషయంలో ఎక్కడా ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకునే బాధ్యత నాదని అన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో నిదులు కొరత లేకుండా నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రతినిత్యం ఏదో ఒకచోట శంకుస్థాపన నిర్వహించేవారమని గుర్తు చేశారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండున్నర సంవత్సరాలైనా కూడా నియోజకవర్గానికి అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం లేదని అరకొర నిధులతో అభివృద్ధిని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా తాను అందుబాటులో ఉంటానని అఖండ మెజారిటీతో మూడుసార్లు గెలిపించిన ప్రజల రుణం ఎన్ని కష్టనష్టాలు ఎదురైనా సరే ఓర్చుకుని ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, బిక్షపతి, బి.ఆర్.ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

చేయూత యాప్ నమోదు కార్యక్రమం..

వివరాలు సేకరిస్తున్న దృశ్యం

కూకట్‌పల్లి, మే 28, ప్రభాతవార్త

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల పెన్షన్ పొందుతున్న లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వ రూపొందించిన చేయూత యాప్‌లో నమోదు చేసే కార్యక్రమం కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారుల ముఖ గుర్తింపు ఫోటోలు సేకరించబడుతున్నాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వెల్లడించారు. సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కూకట్‌పల్లి సర్కిల్ కమ్యూనిటీ ఆర్గనైజర్ వి.ఆర్.కె పాప గౌడ్, రిసెర్స్ పర్సన్ జానకి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని అధికారులు తెలిపారు.

డాక్టర్ లక్ష్మణ్‌కు బిజెపి నేతల సన్మానం

రాజ్యసభ హౌస్ కమిటి చైర్మన్‌గా నియమితులైన డాక్టర్ లక్ష్మణ్ సన్మానిస్తున్న దృశ్యం

బేగంబజార్,మే 29ప్రభాతవార్త: రాజ్యసభ హౌస్ కమిటి చైర్మన్‌గా నియమితులైన రాజ్యసభ సభ్యులుడాక్టర్ లక్ష్మన్‌ను బిజెపి రాష్ట్ర కార్యవర్గసభ్యులు,మహేష్‌బ్యాంకు వైస్ చైర్మన్ గోవింద్‌రాఠి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈమేరకు డాక్టర్ లక్ష్మన్ శాలువ కప్పి సన్మానించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి కోసం అంకిత భావంతో పని చేసే వారికి తప్పకుండా పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు.ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా కరెంట్ కట్ చేసిన చుడీబజార్ సెక్షన్ సిబ్బంది

కరెంట్ కట్ చేయడంతో అడ్డుకున్న స్థానికులు

అఫ్జల్‌గంజ్,మే 29ప్రభాతవార్త: పెరుగుతున్న ఎండ వేడిమి తట్టుకోలేక ఓవైపు ఉంటున్న సందర్భంలోచుడీబజార్ విద్యుత్ శాఖ ఎ.ఇ పరిధిలోని అధిక కరెంటు బకాయిలు ఉన్నాయని చెప్పపెట్టకుండా విద్యుత్ కనెక్షన్ కట్ చేశారు.దీంతో చుడీబజార్,ఊట్‌వాడి బస్తీ పరిసర ప్రాంతాలల్లో విద్యుత్ బిల్లులు బకాయిలుఉన్నట్లు సాకు చూపి విద్యుత్ సిబ్బంది కరెంట్ కట్ చేసినట్లు స్థానికులు వాపోతున్నారు.విపరీతమైనఎండలు ఉన్నప్పటికి ఇండ్లలో ఆకస్మాత్తుగా వచ్చి కరెంట్ వైర్లను తొలగించి ఇబ్బందుల పాలుచేస్తున్నారనివాపోతున్నారు.విద్యుత్‌శాఖ సిబ్బంది ఏకంగా గడువు ఇవ్వకుండా కరెంట్ చేయడం ఎంత వరకు సమంజసమని విద్యుత్ శాఖ అధికారులను స్థానికులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకునిమొండి బకాయిలు ఉంటే వాయిదా పద్దతిలో కరెంట్ బిల్లులను చెల్లించే విధంగా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

జూన్ 7న బాలల జాతీయ స్థాయి ప్రతిభోత్సవాలు

చిక్కడపల్లి మే 29 ప్రభాతవార్త :

అంతర్జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 7వ తేదీన బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బాలల జాతీయ స్థాయి ప్రతిభోత్సవము 2026 నిర్వహించనున్నట్లు స్ఫూర్తి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్, కొరియోగ్రాఫర్ ఇ. సూర్యతేజసుబ్రాంత్ మాస్టర్ , వ్యవస్థాపకులు ఈ ఎస్. సూర్య నారాయణ మాస్టర్ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో బాలబాలికల్లో దాగి ఉన్న విభిన్న కళా ప్రతిభను వెలికితీసేందుకు ఈ వేదికను కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంగీతం (లలిత గీతాలు, కీర్తనలు, దేశభక్తి గేయాలు, జానపద, సినిమా పాటలు), మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ (గిటార్, కీబోర్డ్, డ్రమ్స్, తబలా, మృదంగం, వయొలిన్), నృత్యం (కూచిపూడి, భరతనాట్యం, కథక్, ఆంధ్రనాట్యం, పేరిణి, జానపదం, వెస్ట్రన్), సోలో, డ్యూయెట్, గ్రూప్స్, మిమిక్రీ, మ్యాజిక్, ఏకపాత్రాభినయం, కరాటే, కుంగ్ఫు వంటి పర్ఫార్మింగ్ ఆర్ట్స్‌లో పోటీలు ఉంటాయని వివరించారు. గోల్డ్ మెడల్స్, సర్టిఫికెట్ల ప్రధానం: ఈ ప్రతిభోత్సవంలో పాల్గొన్న బాలబాలికలందరికీ ప్రత్యేక ప్రోత్సాహకంగా సర్టిఫికెట్, గోల్డ్ కోటెడ్ మెమెంటో (గోల్డ్ మెడల్) అందించి సత్కరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ఉత్సవాల్లో పాల్గొనదలచిన 4 సంవత్సరాల నుండి 16 సంవత్సరాల వయస్సు గల పిల్లల తల్లిదండ్రులు లేదా గురువులు తమ వివరాలను జూన్ 4వ తేదీ లోపు 7893940600 లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

రోడ్డు దాటుతున్న మహిళకు గుండెపోటు...సిపిఆర్ చేసినా దక్కని ప్రాణాలు

బేగంపేట మే 29,ప్రభాతవార్త

బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్‌లో రోడ్డు దాటుతున్న ఓ మహిళకు గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు.ఇది గమనించిన స్థానికులు,అక్కడ విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ సిబ్బంది.తిరుమల గిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు మహిళకు సీపీఆర్ చేసి సకాలం(గోల్డెన్ హవర్)లో ఆసుపత్రికి తరలించినా మహిళ ప్రాణాలు కోల్పోయింది.ఈ సంఘటన బేగంపేట లో శుక్రవారం జరిగింది. పొట్ల లావణ్య అనే మహిళ శ్యాంలాల్ బిల్డింగ్ ఎదురుగా భారత్ పెట్రోలు పంప్ వద్ద రోడ్డు దాటుతుంది.ఇదే సమయంలో ఆమె గుండె పోటుకు గురయ్యారు.ఇది గమనించిన స్థానికులు ఆమెను పెట్రోలు పంప్ ఆవరణలోకి తరలించారు.అదే సమయంలో ఆప్రాంతంలో క్రేన్ డ్యూటీలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ సిబ్బంది పీసీ 3759భరత్,పీసీ 2519మన్మధరావు(మొబైల్1)ఆమెకు సీపీఆర్ నిర్వహించారు.విషయం తెల్సుకుని అక్కడికి చేరుకున్న తిరుమలగిరి ట్రాఫిక్ ఏసీపీ జి.శంకరరాజు సంఘటనా స్థలానికి చేరుకుని వెంటనే సీపీఆర్ చేయడంతో

రోడ్డు దాటుతూ గుండె పోటుకు గురై మృతి చెందిన మహిళ.

పాటు అంబులెన్స్‌రాక పోవడంతో తన వాహనంలో మహిళను కిమ్స్‌సన్‌షైన్ ఆసుపత్రికి తరలించారు. ఆమెను పరిక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు ప్రకటించారు.సకాలంలో స్పందించిన స్థానికులను,ట్రాఫిక్ సిబ్బందిని ట్రాఫిక్ ఏసీపీ శంకరరాజు అభినందించారు. స్థానికులు కూడా సకాలంలో స్పందించిన ట్రాఫిక్ ఏసీపీ,సిబ్బందిని,అక్కడ ఉండి సహాయం అందించిన వారిని అభినందించారు.

మానవతకు మారు పేరు కృష్ణ : సినీ దర్శకుడు నరసింహారావు

చిక్కడపల్లి మే 29 (ప్రభాతవార్త) : ఎట్టి స్థాయిలో మనిషి నైనా గౌరవించే కృష్ణ మానవత కు మారు పేరు అని ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు అన్నారు శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై వంశీ ఇంటర్నేషనల్ (, ఇండియా,), శ్రీ కృష్ణ స్వర రాగ స్రవంతి నిర్వహణలో విఖ్యాత నటుడు కృష్ణ జయంతి సందర్భంగా ఆయన మేకప్ మన్ చేబ్రోలు మాధవ రావు కు సత్కారం జరిగింది ముఖ్య అతిథి గా పాల్గొన్న రేలంగి నరసింహారావు సత్కారం చేసి మాట్లాడారు కృష్ణ నిర్మాతల కష్టసుఖాలు తెలిసిన ఉత్తమ వ్యక్తిత్వం కల వారని చెప్పారు మాధవ రావు అరవై సంవత్సరాలు కృష్ణ కు పర్సనల్ మాకప్ మాన్ గా ఉన్నా ఆత్మీయ మిత్రుడు గా భావించారని వివరించారు వంశీ సంస్థ తెరవెనుక ఉన్న సాంకేతిక నిపుణులు ను గుర్తించి సత్కరించటం అపురూపం అన్నారు మాధవ రావు మాట్లాడుతూ కృష్ణ కి తొలి మేకప్ వేసింది మొదలు చివరి సినిమా వరకు పని చేశాను అని చెప్పారు ఒకసారి అభిమానం కలిగితే కృష్ణ వారిని వదలరని

మేకప్ మన్ చేబ్రోలు మాధవ రావును సత్కరిస్తున్న ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు

తెలిపారు వంశీ రామరాజు అధ్యక్షత వహించిన వేదిక పై గాయకుడు వై ఎస్ రామ కృష్ణ పాల్గొన్నారు ఈ సందర్భం గా కృష్ణ పి ఆర్ ఓ బాలాజీ శర్మ, కృష్ణ మహేష్ సేన అధ్యక్షుడు మల్లేశ్ గంటి సాయిజీ తదితరులు సుంకర పల్లి శైలజ పర్యవేక్షణ చేశారు తోలుత కృష్ణ నటించిన సినిమా లలో పాటలు లక్ష్మి శారద రెడ్డి రామ కృష్ణ తదితరులు మధురంగా ఆలపించారు.

కమ్యూనిటీ హాల్ పనులను వేగవంతం చేయాలి : పావని వినయ్ కుమార్

చిక్కడపల్లి మే 29 (ప్రభాతవార్త) :

గాంధీనగర్ డివిజన్ పరిధిలోని బాపునగర్ యూత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను శుక్రవారం గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి ఎ.పావని వినయ్ కుమార్ పరిశీలించారు. గతంలో జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్ నిధులు రూ.1 కోటితో చేపట్టిన డివిజన్ అభివృద్ధి పనులలో భాగంగా, రూ.9 లక్షల వ్యయంతో అరుంధతి నగర్ బస్తీ కమిటీ హాల్, చిక్కడపల్లి, బాపునగర్ యూత్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ రెన్నోవేషన్ పనులను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం బీజేపీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని ఎ.పావని వినయ్ కుమార్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ మరమ్మత్తు పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి, స్థానిక ప్రజలకు త్వరలోనే అందుబాటులోకి తెచ్చేలా ఇంజనీరింగ్ అధికారులు

కమ్యూనిటీ హాల్ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, ఎం.ఉమేష్, ఆనంద్ రావు, సాయి గౌడ్, బస్తీ నాయకులు రాజు, రేవంత్, ఉదయ్, సాయి తేజ, క్రాంతి, భాగ్య, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజలే నాదేవుళ్లని చెప్పిన ఏకైన నాయకుడు ఎన్టీ రామారావు : బండారు దత్తాత్రేయ

నాంపల్లి, మే 29 ప్రభాతవార్త : పద్మశ్రీ డా. ఎన్.టి.రామారావు తెలుగుజాతికి, తెలుగుభాషకు ప్రపంచవ్యాప్తంగా ఆత్మగౌరవాన్ని తీసుకొచ్చిన మహానుభావుడని హరియాణా, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ అన్నారు. పేదప్రజలే నాదేవుళ్లని చెప్పిన ఏకైన రాజకీయ నాయకుడు ఎన్టీరామారావు ప్రజల సంక్షేమ, అభివృద్ధే లక్ష్యంలో ఎన్ని ప్రజాహిత పథకాలను ప్రవేశపెటి ఆదుకున్నారని గుర్తుచేశారు. ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌మీద అద్భుతం, కళాత్మకంగా ఏర్పాటు చేసిన మన సాహిత్యం, కళలు, చరిత్ర, మహాపురుషుల విగ్రహాలను ప్రతిష్టించి హైదరాబాద్ నగరంతోపాటు యావత్ తెలుగుజాతికే గొప్ప పేరుప్రఖ్యాతులు తీసుకొచ్చారని స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఇలాంటి నాయకులు చాలా అరుదని చెప్పారు. ట్రస్టు చేస్తున్న వివిధ సేవలు ఎనలేనివి, అనితరసాధ్యమని కమలాకరభారతి, సంస్థను అభినందించారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షోపన్యాసంలో మే 28 ఎంతో మహానుభావులైన ముగ్గురు త్రిమూర్తులు ఒకరు సురవరం ప్రతాపరెడ్డి, మరొకరు స్వాతంత్ర్యయోధుడు వీర సావర్కర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు నందమూరి తారక రామారావుల పుట్టినరోజుని గుర్తుచేశారు. ముగ్గురూ భౌతికంగా లేకపోయినా వారి అడుగుజాడలున్నాయని, కళా సాహిత్య నైపుణ్య, ధీరత్వం వారివని, మనందరికి ఆచరణ స్ఫూర్తిదాయకమని స్పష్టం చేశారు. కమలాకర మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని డా.

సకలకళల భారతీయ గ్రంథావిష్కరణ కావిస్తున్న బండారు దత్తాత్రేయ, వెంకటరెడ్డి, కృష్ణకుమారి, కమలాకర భారతి తదితర అతిథులు

నందమూరి తారక రామారావు కళావేదికలో సంస్థ 39వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖకవి, ధర్మప్రచారకుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పూర్వ గవర్నరు బండారు దత్తాత్రేయ ఆత్మీయ అతిథులు డా. కె.వి.కృష్ణకుమారి(సీతక్క), పి.శ్యామలాదేవి, కమలాకర భారతి, వెంకటాచార్యులు, సిహెచ్.ఆదినారాయణ, బి.రాజేంద్రబాబు తదితరులతో కలిసి పద్మశ్రీ డా. ఎన్.టి.రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘననివాళులర్పించి ముందుగా కమలాకర ట్రస్ట్ 39వ వార్షిక ప్రత్యేక సంచిక సకల కళల భారతీయ గ్రంథాన్ని ఆవిష్కరించి అనంతరం వివిధరంగాల్లో విశేష సేవలం దిస్తున్న ప్రముఖులు ఆరుగురికి ఎన్.టి.ఆర్ స్మారక పురస్కారాలను ప్రదానంచేసి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. సభకుముందు ప్రముఖ కళాకారుల వినోద కార్యక్రమాలు ఆహుతులను ఆహ్లాదపరిచి తన్మయుల్ని చేశాయి.

పినరయి విజయన్‌పై ఈడీ దాడులు కేంద్ర ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపే : దండి వెంకట్

చిక్కడపల్లి మే 29, ప్రభాతవార్త : దేశంలో ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగ సంస్థలను బీజేపీ కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా దుర్వినియోగం చేస్తోందని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకులను లొంగదీసుకోవడానికి ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ఆయుధాలుగా ఉపయోగించడం అత్యంత ప్రమాదకర పరిణామమని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం నల్లకుంటలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో దండి వెంకట్ మాట్లాడారు. పినరయి విజయన్ లక్ష్యంగా ఈడీ పేరిట జరుగుతున్న రాజకీయ దాడులను తమ పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు రాజకీయంగా ఎదురు నిలిచే వామపక్ష శక్తులను, ప్రజాస్వామ్యవాదులను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఇటువంటి కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశంలో మైనారిటీలు, బహుజనులపై జరుగుతున్న దాడులు, పెరుగుతున్న నిరుద్యోగం, ఆకాశాన్నంటుతున్న ధరలు, రైతాంగ సంక్షోభం వంటి కీలక ప్రజా సమస్యలపై సమాధానం చెప్పలేని కేంద్ర ప్రభుత్వం.. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ విధమైన దాడులకు తెగబడుతోందని దండి వెంకట్ ఆరోపించారు. కేరళలో ప్రజా సంక్షేమ పాలన అందించిన వామపక్ష నాయకత్వంపై రాజకీయ కక్షసాధింపుతో వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటిదన్నారు. "దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ విలువలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఇటువంటి రాజకీయ వేధింపులు, మోసపూరిత వైఖరిపై ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, బహుజన వామపక్ష శక్తులు ఐక్యంగా ఉద్యమించాలి దండి వెంకట్ పిలుపునిచ్చారు.

నాచారం ఇందిరానగర్‌లో సిసి రోడ్డు పనులను పర్యవేక్షించిన సాయిజన్ శేఖర్

నాచారం, మే 29 ప్రభాతవార్త :

నాచారం ఇందిరానగర్ రోడ్ నెంబర్1లో గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు ప్రారంభించారు. జరుగుతున్న పనులను స్థానిక బస్తీవాసులతో కలిసి బీఆర్‌ఎస్ నాయకుడు సాయిజెన్ పరిశీలించారు.ఈ సందర్భంగా సాయిజెన్ మాట్లాడుతూ ఇందిరానగర్ చిన్న బ్రిడ్జి నుంచి ఎడమవైపు మొదటి లైన్ వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే ఇదే కాంట్రాక్టర్ ద్వారా ఇందిరానగర్‌లోని నోబుల్ స్కూల్, ఇంద్ర స్కూల్ పరిసర ప్రాంతాల్లో కూడా కొత్త సిమెంట్ రోడ్లు మంజూరయ్యాయని వెల్లడించారు.ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు

పనులను పరిశీలిస్తున్న సాయిజన్ శేఖర్

తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేకల ముత్యం రెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, చంద్రశేఖర్, ఆశు, అమీర్, దేవులపల్లి యాదగిరి, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాలకూ నీళ్లు లేవ్..!

-ఇచ్చేది పది నిమిషాలు..
-ఏ రోజు ఏ సమయానికి వస్తాయో తెలియని అయోమయం
-షిఫ్ట్ ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర అసౌకర్యం
-నెలల తరబడి లీకేజీలు
-ఇష్టారాజ్యంగా పంప్ ఆపరేటర్ల తీరు

అత్తాపూర్ మే29, ప్రభాతవార్త :

వేసవి తాపానికి రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. శివరాంపల్లి బీకర్ సెక్షన్ కాలనీ, ప్రశాంత్ కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, బుద్వేల్ రైల్వే స్టేషన్, నేతాజీ నగర్, గగన్‌పహడ్ ,బండ్లగూడ జాగిర్ తదితర ప్రాంతాల్లో బోర్లు మొరాయించడంతో కనీసం నిత్యావసరాలకు కూడా నీళ్లు లేక స్థానికులు నానా తంటాలు పడుతున్నారు. భూగర్భజలాలు అడుగంటడంతో కొన్ని బస్తీలు,కాలనీలలో సుమారు 20 నుండి 30 వరకు నూతన బోర్లు తవ్వినట్లు సమాచారం . గ్రేటర్ పరిధిలో రోజు విడిచి రోజు నీటి సరఫరా విధానం ఉన్నప్పటికీ, ఇక్కడ మాత్రం ఏ రోజు ఏ సమయానికి నీళ్లొస్తాయో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల ఉదయం, మరికొన్ని చోట్ల సాయంత్రం, అర్ధరాత్రి నీటిని సరఫరా చేస్తున్నారు. వేకువజామునే విధులకు వెళ్లే పేదలు, షిఫ్ట్ ఉద్యోగులు నిర్దిష్ట సమయం లేకపోవడం వల్ల తాగేందుకు కూడా నీళ్లు పట్టుకోలేకపోతున్నారు.

లోప్రెషర్ తలనొప్పులు

వచ్చే కొద్దిపాటి నీరు కూడా కేవలం 10 నుండి 20 నిమిషాలు మాత్రమే, అది కూడా లోప్రెషర్‌తో రావడంతో నీళ్లు చాలీ

చాలక జనం మండిపడుతున్నారు. ఈ సమస్యలపై పంప్ ఆపరేటర్లను ప్రశ్నిస్తే నిర్లక్ష్యపు సమాధానాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల మంచినీటి పైపులైన్లు లీకేజీలు అవుతున్నా జలమండలి అధికారులు నెలల తరబడి మరమ్మతులు చేయడం లేదు.

నిబంధనలకు విరుద్ధంగా బోర్ల తవ్వకం

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలో వెలుస్తున్న బహుళ అంతస్తుల నిర్మాణాల కోసం వాల్టా చట్టాన్ని ఉల్లం ఘించి విచ్చలవిడిగా బోర్లు తవ్వుతున్నారు. నిర్మాణ సంస్థలు నిబంధనలకు విరుద్ధంగా నీటిని తోడేస్తుండటం వల్లే చుట్టు పక్కల కాలనీల్లో భూగర్భ జలాలు వేగంగా అడుగంటిపోతున్నాయని,అధికారులు దీనిపై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జలమండలి అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పంప్ ఆపరేటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో తిష్టవేసిన సిబ్బందిని వెంటనే వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

చోరీకి పాల్పడిన నిందితుడి అరెస్టు.. 20 తులాల బంగారం స్వాధీనం

సరూర్‌నగర్, మే 29 ప్రభాతవార్త:

దొంగతనాలు చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న పాత నేరస్థుడిని బాలాపూర్ పోలీసులు అరెస్టు చేసి దాదాపు రూ.20 లక్షల విలువ జేసే 20 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకొని కటకటాల వెనక్కి పంపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఇన్స్‌పెక్టర్ సుధాకర్ కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. బాలాపూర్ సమీపంలోని షాహిన్‌నగర్ బిస్మిల్లా కాలనీ గ్రీన్ సిటీ ప్రాంతానికి చెందిన ప్లంబర్ హబీబ్ అహ్మద్ అలియాస్ చోటు (37) దొంగతనాలు చేస్తుంటాడు. అయితే గత ఏప్రిల్ నెల 14న డ్రీమ్ లేక్ కాలనీలో చోరీ జరిగినట్లు ఫిర్యాదు రావడంతో రంగంలో దిగిన ఇన్స్‌పెక్టర్ సుధాకర్, డిఎస్ఐ కోటేశ్వర్‌రావులు రెండు బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలించారు. దీంతో బాలాపూర్ ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో అనుమాస్పదంగా వెళ్తున్న హబీబ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ చేసినట్లు అంగీకరించాడు. దీంతో రూ.20 లక్షల విలువ జేసే 14 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి నుండి రూ.18 వేలకు బంగారు గొలుసును కొన్న మహమ్మద్

స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను చూపిస్తున్న బాలాపూర్ ఇన్స్‌పెక్టర్ సుధాకర్: వెనుక మాస్క్ ధరించిన వ్యక్తి నిందితుడు హబీబ్

హుస్సేన్ వద్ద నుండి దానిని స్వాధీనం చేసుకొని అతనిపై కూడా కేసును నమోదు చేశారు. కాగా నిందితుడు హబీబ్‌పై 60 కేసులు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఈ నేపథ్యంలో నిందితులిద్దరినీ రిమాండ్‌కు పంపారు. చోరీ కేసును ఛేదించిన బాలాపూర్ ఇన్స్‌పెక్టర్, డిఎస్ఐ, పోలీసులను ఆదిభట్ల ఎసిపి ప్రదీప్‌కుమార్ రెడ్డి అభినందించారు.

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ నృత్యోత్సవం

చిక్కడపల్లి మే 29 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2, తేదీన 3, వ తేదీన రెండు రోజుల పాటు భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో సృజన కల్చరల్ అండ్ లిటరరీ ఆర్గనైజేషన్ నిర్వహణలో మాదాపూర్ లోని శిల్పారామం లో నృత్యోత్సం నిర్వహిస్తున్నామని సంస్థ చైర్ పర్సన్ అంజనా చౌదరి కార్యదర్శి రమ్య కోశాధికారి సుధీర్ పుంజాల పత్రికా విలేకరులకు తెలిపారు ఛత్తీస్ ఘడ్ రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి రమేష్ అగర్వాల్ ప్రారంభించగా సాంస్కృతిక పర్యాటక ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్ డి జి పి సౌమ్య మిశ్రా తదితరులు పాల్గొంటారు రెండవ రోజు ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర సాంస్కృతిక పర్యాటక శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొనగా ప్రభుత్వ సలహాదారులు వి హనుమంత రావు శాంతి కుమారి ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ లు అతిథులుగా హాజరు అవుతారు రెండు రోజుల నృత్యోత్సం లో వివిధ రాష్ట్రాలకి చెందిన ప్రముఖ శాస్త్రీయ జాన పద నృత్య కళాకారుల ప్రదర్శన ఉంటాయని వారు తెలిపారు.

వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి దేవాలయంలో శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం

చిక్కడపల్లి మే 29 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి స్థానిక వివేక్‌నగర్‌లోని దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు శ్రీమత్ సుందరకాండ సప్తాహ్నిక యజ్ఞం అత్యంత వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం, ముఖ్య అర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వెంకటాద్రి వివరించారు. శుక్రవారం కార్యక్రమానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ యజ్ఞంలో భాగంగా శ్రీమత్ సుందరకాండ హోమముతో పాటు 108 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీసా హోమము, చండీ నవశతి హోమము, శ్రీ రుద్ర హోమము, హనుమత్ కార్యసిద్ధి హోమము, నవగ్రహ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. జూన్ 1 న ఉదయం 8 గంటలకు శ్రీ గణపతి పూజ, పుణ్యాహవాచనము, అఖండ దీపారాధన, అగ్నిప్రతిష్ఠాపన, శ్రీమత్ సుందరకాండ హోమము. సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాలపూజ, శ్రీరుద్రహోమము, రాజోపచార పూజ (చతుర్వేద అవధానాలు), 2న శ్రీ హనుమత్ కార్యసిద్ధి హోమము, 3న నవగ్రహ హోమము, 4న మేధా దక్షిణామూర్తి , దత్తాత్రేయ హోమము, 5న శ్రీ చండీ సప్తశతి హోమము, 6న 108 పర్యాయములు శ్రీ హనుమాన్ చాలీ సా హోమము, 7న పూర్ణాహుతి, మంటపోద్వాసన, మహదా శీర్వచనము, ఋత్విక్ సన్మానము, అతిథి సత్కారము, అనంతరం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. భక్తులందరూ ఈ బృహత్ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి దైవకృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రజలు కలిసి మెలిసి ఉత్సవాలను జరుపుకుంటున్నారు



మౌలానా సయ్యద్ బర్కత్ అలీకి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

చార్మినార్,మే 29 ప్రభాతవార్త :

ప్రజలు కలిసి మెలిసి ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని సీనియర్‌బిజెపి నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు.బక్రీద్ పర్వదినం సందర్భంగా ఆయన మౌలానా సయ్యద్ బర్కత్ అలీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర బిజెపి మైనార్టీ మోర్చ అధికార ప్రతినిధి మీర్‌ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ పండుగలను ప్రజలు ఐకమత్యంతో నిర్వహించుకుంటున్నారని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మహిళా న్యాయవాదిపై దాడి, కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 29, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ ఠాణా పరిధిలో ఓ మహిళా న్యాయవాదిపై దాడి జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన ఒక మహిళా న్యాయవాది తన భర్త, అత్తలతో కలిసి కేబీఆర్ ఉద్యానవనం సమీపంలోని క్రీమ్‌స్టోన్ ఐస్‌క్రీం స్టోర్ వద్దకు వచ్చారు. అదే సమయంలో ఒక వ్యక్తి ఫొటోలు తీస్తుండటంతో ఆమె ప్రశ్నించగా సైబరాబాద్ కమిషనర్‌కు పంపుతున్నట్లు సమాధానమిచ్చాడు. అనంతరం హుమేరా వార్సీ అనే మహిళతోపాటు మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికి వచ్చి దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడ్డారు. ఆమె కుటుంబ సభ్యులపై సిగరెట్ పొగను ఊదుతూ అసభ్యంగా ప్రవర్తించారు. అదే సమయంలో హుమేరా వార్సీ మహిళా న్యాయవాదిని చెంపపై కొట్టింది. అక్కడున్న వారు జోక్యం చేసుకోవడంతో గొడవ సద్దుమణిగింది. జరిగిన సంఘటనపై మహిళా న్యాయమాది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జొమాటా డెలివరీ బాయ్‌పై కత్తితో దాడి

జూబ్లీహిల్స్, మే 29, ప్రభాతవార్తః

జొమాటో డెలివరీ బాయ్‌పై షావర్మా కత్తితో దాడి చేసిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన విద్యార్థి అయిన ప్రశిక్(25) ప్రస్తుతం బాల్కంపేట్‌లో నివాసం ఉంటూ పార్ట్‌టైమ్‌గా జొమాటో ఫుడ్ డెలివరీ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27వ తేదీ రాత్రి సుమారు 8:20 గంటలకు సోమాజిగూడలోని లక్కీ మల్టీ క్యూజిన్ రెస్టారెంట్ నుంచి ఫుడ్ పికప్ ఆర్డర్ రావడంతో అక్కడికి వెళ్లాడు. రాత్రి 8:30 గంటల సమయంలో రెస్టారెంట్‌కు చేరుకున్న ప్రశిక్, ఆర్డర్ సిద్ధమైందా అని షావర్మా సెక్షన్‌లో పనిచేస్తున్న వ్యక్తిని అడిగాడు. 15 నిమిషాలు వేచి ఉండాలని చెప్పడంతో దాదాపు 20 నిమిషాలు వేచి చూసిన తర్వాత సమయం ఆలస్యమవుతోందని మరోసారి ఆర్డర్ గురించి ప్రశ్నించగా, ఆ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇంకా వేచి ఉండాలన్నాడు. తనతో మర్యాదగా మాట్లాడాలని ప్రశిక్ కోరగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఆ వ్యక్తి ఒక్కసారిగా షావర్మా కత్తితో ప్రశిక్‌పై దాడి చేసి చేతులతో తోసివేశాడని తెలిపారు. ఈ దాడిలో ప్రశిక్ మెడ భాగంలో గాయాలు కావడంతో పాటు తల వెనుక భాగంలో స్వల్ప రక్తస్రావ గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అక్కడికి చేరుకుని నిందితుడిని అడ్డుకున్నారు. బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేయగా పంజాగుట్ట పోలీసులు సెక్షన్లు 118(1), 352, 351(2) కింద దర్యాప్తు చేస్తున్నారు.

హుస్సేన్ సాగర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బేగంపేట మే 29,ప్రభాతవార్త

హుస్సేన్ సాగర్ సరస్సులో శుక్రవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది.కృష్ణా ఆలయం ఎదురుగా ట్యాంక్ బండ్ వద్ద మృతదేహం తేలియాడుతుండటాన్ని గుర్తించిన స్థానికులు లేక్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. లేక్ పోలీసులు ట్యాంక్ బండ్ శివ బృందం సహాయంతో మృతదేహాన్ని బయటకు తీసారు.మృతుడి వయస్సు సుమారు 40సంవత్సరాలు ఉంటుందని,మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి మార్చురీలో ఉంచామని పోలీసులు తెలిపారు.మృతుని ఆచూకి తెల్సిన వారు లేక్ పోలీసులకు సమాచారం అందించాలన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

జిల్లెడు చౌదరిగూడ, మే 29,(ప్రభాతవార్త): ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగ అభివృద్ధి చెందాలని ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా సమైక్య ఆధ్వర్యంలో ఋణమేళా కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేకర్ మాట్లాడుతూ మహిళలను మహిళా సంఘాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహిళా సంఘాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సంఘాలకు వడ్డీఋణమాఫీ ఇందిరమ్మ చీరల పంపిణీ మహిళా సంఘాలకు 200000లక్షల వరకు ఋణం పెంచడం మహిళా సంఘాలకు బస్సులు ఇప్పించి ఆర్‌టిసిలో అద్దెకు నడిపించుకునేలా అవకాశం ఇచ్చారని తెలిపారు. రేషన్ కార్డ్స్ అలాగే ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వపథకాలు మహిళా పేర్లపైన మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రాబోయే రోజులో ప్రభుత్వం మరిన్ని కొత్త పథకాలు తెచ్చి మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చలివేంద్రం పల్లి రాజు, నర్సిములు కుమార్ ,నీలయ్య, నవీన్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించిన కౌన్సిలర్ కళ్యాణి

చేవెళ్ల, మే 29, ప్రభాతవార్త : చేవెళ్ల మున్సిపల్ 18వ వార్డు (అంగడి బజార్)లో విద్యుత్ సమస్యలపై స్పందించిన కౌన్సిలర్ మంగలి కళ్యాణియాదగిరి స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి 15 కరెంటు స్తంభాలు, లైట్లు మంజూరు చేయించారు. శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు కాలనీలో పరిశీలన నిర్వహించగా త్వరలో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ కృషికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యను వివరిస్తున్న కౌన్సిలర్

అంతర పంటలు,తడి-పొడి పద్ధతులతోనే లాభం

దౌల్తాబాద్,మే 29,ప్రభాతవార్త: మారుతున్న వాతావరణ పరిస్థితులు,పొంచి ఉన్న 'ఎల్నినో' (కరువు) ముప్పును తట్టుకునేందుకు రైతులు వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని వాసన్ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ సూచించారు.వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండల రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ,వాసన్ సంస్థ సహకారంతో జీవ వైవిధ్య పంటల సాగు,ఎల్నినో ప్రభావంపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వాసన్ సంస్థ ప్రతినిధి లక్ష్మణ్ మాట్లాడుతూ..కంది,ప్రత్తి పంటల్లో ంతర పంటలుగా సేంద్రియ పద్ధతిలో 70 రోజుల్లో వచ్చే పెసర,మినుము,కొర్రలు,బొబ్బర్లు సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు అదనపు ఆదాయం లభిస్తుందన్నారు.అలాగే కరువు పరిస్థితుల్లో బోరు నీటిని సమర్థవంతంగా వాడు కునేందుకు వరి సాగులో 'తడి-పొడి' పద్ధతిని పాటించాలని వివరించారు.అనంతరం రైతులకు అందుబాటులో ఉంచిన పలు రకాల విత్తనాల ప్రదర్శనను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దౌల్తాబాద్,దోమ,బొంరాస్‌పేట్ సర్పంచులు,వాసన్ సంస్థ ప్రతినిధులు,రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న వాసన్ సంస్థ ప్రతినిధులు

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

ప్రారంభోత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, మే 29, ప్రభాతవార్త :
కేశంపేట మండల పరిధిలోని ఆల్వాల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ లంకాల సురేష్ రెడ్డి అధ్యర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం కింద మంజూరైన 40 ఇందిరమ్మ ఇండ్లలో శుక్రవారం 8 ఇందిరమ్మ ఇండ్లు, మహిళా సంఘం భవనాన్ని మరియు అంగన్వాడి భవనాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పం చ్ సురేష్ రెడ్డి,గ్రామ ప్రజా ప్రతినిధులు,ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి నూతన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు నూతన వస్త్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, నిరుపేదల సంక్షేమం దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకువచ్చిందని, ఈ పథకం ద్వారా అనేక మంది పేదలు సంతోషంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా లబ్ధిపొందిన కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించడం జరుగుతోందని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ సురేష్ రెడ్డి మాట్లాడుతూప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అనే కలను సాకారం చేయడం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యం అని అన్నారు.ఇందిరమ్మ ఇల్లు పథకం నిరుపేదలైన ఎంతోమంది ఎంతో మంది నిరాశ్రయులకు స్థిర నివాసం లభిస్తోంది. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని తెలిపారు , అర్హులైన ప్రతి నిరుపేద వారికి ఇల్లు ఇచ్చి తీరుతామని భరోసా ఇచ్చారు. పేదరిక నిర్మూలనే లక్ష ్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని అన్నారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారురాలు మాట్లాడుతూ మాకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించిన సిఎం రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శంకర్‌కు స్థానిక సర్పంచ్ సురేష్ రెడ్డికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాదీం, మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, మొహమ్మద్ ఇబ్రహీం, బాలరాజ్,రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తం రెడ్డి, కేశంపేట మండలం అధ్యక్షులు, రమేష్, మాజీ మండల అధ్యక్షులు వీరేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్ రెడ్డి,ఉపసర్పంచ్ మల్లేష్, శ్రీశైలం, వెంకటేష్, నరేష్, నవీన్, శ్రీకాంత్, చెన్నయ్య, పాండు, శ్రీను, శేఖర్, మంగలి శ్రీశైలం, కోరే నర్సింహా, జగదీష్, సుదర్శన్, అహ్మద్,కాంగ్రెస్ నాయకులు, మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని గెలిపించండి

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

శంకర్‌పల్లి: మే 29, ప్రభాతవార్త : కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జేసీసీ యువతను రెచ్చగొడుతూ వారిని రోడ్లపైకి రావాలని పిలుపు ఇవ్వడంపై కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శంకర్‌పల్లి మండలం పొద్దుటూరు గ్రామ పరిధిలోని ప్రగతి రిసార్ట్స్‌లో జిల్లా స్థాయి రెండు రోజుల ప్రశిక్షణా శిబిరం శుక్రవారంతో ముగిసింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు పతంగి రాజ భూపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హాజరై మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఓ నేత కేంద్ర ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలని పిలుపునిస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రోత్సహిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ఒకే రాష్ట్రం, ఒకే చట్టం, ఒకే ఓటు అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళ్తుందని స్పష్టం చేశారు. పార్టీ కన్న తల్లి లాంటిది. పార్టీ ప్రతిష్టతకు రానున్న కార్పొరేషన్ ఎన్నికలలో ప్రతి కార్పొరేటర్ గెలుపుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఎన్నికలలో పార్టీ ఎవరిని నియమించిన వారి గెలుపుకు ప్రతి ఒక్కరు పట్టుదలతో గెలిపించుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రాజ్, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం, మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్య గౌడ్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ఇంద్రారెడ్డి, నాయకులు తుళ్ల వీరేందర్ గౌడ్, అంజన్ కుమార్ గౌడ్, శంకర్‌పల్లి మండల, మున్సిపల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్ నగర్, మే 29, ప్రభాతవార్త : షాద్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శక్తి వారోత్సవాల పట్టణ మెప్మా వారి ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు మంజూరైన 4కోట్ల రూపాయలు గల చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ...ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. మహిళల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళా సంఘాల వ్యవస్థ ప్రారంభమైనదని, దేశం రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మహిళల ద్వారా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయడం లక్ష ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసిందన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు పరిమితిని రూ 5 లక్షల నుండి 10 వరకు పెంచి, బ్యాంకు రుణాల వడ్డీని ప్రభుత్వమే భరిస్తుంది అన్నారు. మహిళలకు ఉచితబస్ ప్రయాణం, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష ్యం అని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక అభివృద్ధికి తోడ్పడే మహిళా సమైక్య భవనాలు ఉపయోగపడతాయన్నారు.మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయాలు సాధించాలని ఆకాంక్షి ంచారు, ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్, మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, కౌన్సిలర్ మురళీ మోహన్, దిలీప్, బచ్చలి నరేష్,కో ఆప్షన్ సభ్యురాలు ఉషారాణి, నేతలు కృష్ణ రెడ్డి, నల్లమోని శ్రీధర్, మహమ్మద్ ఇబ్రహీం, బాలరాజు గౌడ్,ముబారక్ అలీఖాన్, సాదిక్, సోలీపూర్ అనిల్, చందూలాల్, కరుణాకర్, రాయికల్ శ్రీనివాస్, చందు నాయక్, రవితేజ, తుపాకుల శేఖర్, రమేష్, మెప్మా సిబ్బంది పట్టణ సమైక్య అధ్యక్షురాలు జయమ్మ, గోసియా,అనితా , శైలజ, విజయ, భాను, సునీత, స్వప్న, నీరజ, సంగీత ,గౌరమ్మ, అనిత, బాలమణి జ్యోతి ,తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ ఎస్‌బిఐలో మహిళా సంఘాల రుణమేళా

-రూ.1.03 కోట్ల చెక్కుల పంపిణీ

-అబ్దిదారులకు శాంక్షన్ లెటర్లు అందజేసిన ప్రజాత్రినిధులు,అధికారులు

దౌల్తాబాద్,మే 29,ప్రభాతవార్త:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దౌల్తాబాద్ శాఖలో శుక్రవారంరోజు ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాలకు భారీగా రుణాలను మంజూరు చేశారు.మహిళా సాధికారత,ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా ఏర్పాటుచేసిన ఈ రుణమేళా కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలకు రూ.1 కోటి 3 లక్షల రూపాయల రుణాలకు సంబంధించిన శాంక్షన్ లెటర్లను ప్రజాప్రతినిధులు,అధికారుల చేతులమీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బోడి వెంకట్‌రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి జంగం వీరన్న,ఏపీఎం వెంకన్నలు ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళలకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలు ఆర్థికంగా నిలదొక్కు కోవడానికి,స్వయం ఉపాధి రంగాల్లో రాణించడానికి ఈ రుణాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.బ్యాంక్ అందిస్తున్న ఈ సువర్ణ అవకాశాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకొని,వ్యాపార రంగాల్లో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల ఏపీఎం వెంకన్న,సీసీలు,మండల సమాఖ్య అధ్యక్షురాళ్లు,ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది,మండల సమైఖ్య ఓబీలు,మహిళా సంఘాల ప్రతినిధులు,లబ్దిదారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు,అధికారులు

చేవెళ్లలో ఉచిత యోగా తరగతులు

చేవెళ్ల, మే 29, ప్రభాతవార్త : యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని యోగ శిక్షణ నిర్వాహకులు బిల్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. చేవెళ్ల మోడల్ స్కూల్‌లో ప్రతిరోజు ఉదయం 5:30 నుంచి 6:30 గంటల వరకు ఉచిత యోగ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యోగ ఒత్తిడిని తగ్గించి ఆరోగ్యకర జీవనానికి దోహద పడుతుందని పేర్కొంటూ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ

మోమిన్‌పేట్,మే 29. ప్రభాతవార్త: ప్రజలు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సంబంధించి ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసుశాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను ట్రేస్ చేసి రికవరీ చేయడం జరిగిందని మోమిన్ పేట్ ఎస్ఐ భరత్‌భూషణ్ తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో రికవరీ చేసిన మొబైల్ ఫోన్ యజమానులకు ముందస్తు సమాచారం ఇచ్చి శుక్రవారంరోజు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పోగొట్టుకున్న మొబైల్‌ఫోన్ బాధితుల యొక్క వివరాలు ఈ విధంగా ఉన్నాయన్నారు. 1.అంతగల్లా ఆనందం, టేకులపల్లి గ్రామం, మొబైల్ ఫోన్ (వివో) 2.గొల్ల నర్సింలు, టేకులపల్లి గ్రామం, మొబైల్ ఫోన్ (ఒప్పో) 3.కుంటోళ్ల అశోక్ వెల్‌చాల్ గ్రామం, మొబైల్ ఫోన్ (ఒప్పో) 4.దాస ప్రకాష్ మొరంగపల్లి గ్రామం, మొబైల్ ఫోన్ (ఒప్పో) 5.గిరి నితిన్ కేసారం గ్రామం, మొబైల్ ఫోన్ (రెడ్మి) 6.కుమ్మరి రాములు,కొత్లాపూర్ గ్రామం, మర్పల్లి మండలం, మొబైల్ ఫోన్ (సామ్‌సంగ్) ఈ ఆరుగురికి మొబైల్ ఫోన్లు అప్పగించడం జరిగిందన్నారు. సీఈఐఆర్ ద్వారా ఒక మహిళా మిస్సింగ్ కేసు కూడా చేదించడం జరిగిందన్నారు.

అలాగే ఎస్ఐ భరత్‌భూషణ్ మాట్లాడుతూ, మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో లేదా ఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ మొబైల్ కొన్నపుడు దాని సిల్ బాక్స్ తమ మొబైల్ ఐఎమ్ఈఐ నెంబర్‌నూ భద్రంగా నమోదు చేసుకోవాలని సూచించారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్ల మొత్తం విలువ సుమారు 1,10,0000 రూపాయలుగా ఉంటుందని అంచనా....ఇట్టి మొబైల్ ఫోన్ల రికవరీలో కీలకంగా పనిచేసిన సిబ్బంది మల్లేశ్వరి మరియు మహేష్ కుమార్‌లను ఎస్ఐ భరత్‌భూషణ్ వారిని అభినందించారు. ప్రజలు సీఈఐఆర్ పోర్టల్ సేవలను వినియోగించుకొని వారు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి పొందవచ్చని పోలీసుశాఖ విజ్ఞప్తి చేసింది.

పోయిన మొబైల్ బాధితులకు ఫోన్లు అందజేస్తుఉన్న ఎస్ఐ భరత్‌భూషణ్

'శ్రీమంతుడు' రావాలి

(మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సిద్ధాపూర్ భూములను ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం తీసుకుంటున్నామని చెప్పలేదని, రికార్డుల్లో జనరల్‌గా మాత్రమే నమోదు చేశారని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదన్నారు. వర్షపు నీరు సిద్ధాపూర్ నుంచి కోళ్లపడకల్, పాలమాకుల మీదుగా హిమాయత్ సాగర్‌కు చేరుతుందని, డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే 12 గ్రామపంచాయతీలు డంపింగ్ యార్డ్‌కు వ్యతిరేకంగా తీర్మానాలు చేశాయని, అవసరమైతే గ్రీన్ ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు గొంగళ్ల హరినాథ్ రెడ్డి, సర్పంచులు బాసు నాయక్, గోవింద్ నాయక్, దయానంద్ గుప్తా, చిట్టెడి నరసింహారెడ్డి, సుమిత్ర మల్లారెడ్డి, శాంతి విష్ణు నాయక్, మీనాక్షి దశరథ్ నాయక్, బోకుల శ్రీరాములు, ఉపసర్పంచులు ఎస్‌డీ సిరాజ్, దొబ్బల యాదయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'చలో కలెక్టరేట్'తో ప్రభుత్వానికి గట్టి సందేశం

సిద్ధాపూర్‌లో ప్రతిపాదిత డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకునేందుకు జూన్ 1వ తేదీన చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ప్రజలు, రైతులు, యువత వేలాదిగా ఉద్యమంలో భాగస్వాములు కావాలని డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాట సమితి చైర్మన్ ఎమ్మెస్ సత్యనారాయణ పిలుపునిచ్చారు. కొత్తూరు మండలంలోని ఇములనర్వ గ్రామంలో చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించి నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు తమ భూములను యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనే నమ్మకంతో ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు అదే ప్రాంతంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యం, భవిష్యత్తుతో ఆటలాడుతోందని మండిపడ్డారు. ఇములనర్వకు ఉద్యమాలు కొత్త కాదు.. ప్రజల హక్కుల కోసం ఇక్కడి ప్రజలు ఎప్పుడూ ముందుంటారు అని పేర్కొన్న ఆయన, డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను వెనక్కి తీసుకునే వరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వానికి గట్టి సందేశం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. ఈ ఉద్యమంలో రైతులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బొజ్జ శ్రీనివాస్ రెడ్డి, మెండే కృష్ణయ్య యాదవ్, వద్దే బాలయ్య, పెంటనోళ్ల యాదగిరి, మిట్టు నాయక్, గోపాల్ నాయక్, శ్రీరాములు యాదవ్, కడాల శ్రీశైలం, సతీష్ గుప్తా, ఇంద్రసేనారెడ్డి, బాబు నాయక్, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీను, సల్లా యాదగిరి, సన్నీ మహేష్‌తో పాటు రైతులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎల్లారం శేఖర్ రెడ్డి

ఎస్సైగా ప్రమోషన్ పొందిన గోపాల్‌కు స్టార్‌ను బహుకరిస్తున్న డిసిపి

నందిగామ ఎస్ఐగా కోట్లగోపాల్‌కి ప్రమోషన్

అభినందించిన ఇన్స్పెక్టర్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది

నందిగామ, మే 29, ప్రభాతవార్త : గోపాల్ సర్ ఎస్సై గా ప్రమోషన్ పొందారంటే అందరికీ ఆనందమే. చిన్న, పెద్ద, ముసలి, ముతక వయోభేదం లేకుండా అందరితో మమేకమై ఉండే నైజం అయినది. ఎక్కడో నల్లమల ప్రాంతంలో నిరుపేద వ్యవసాయ కుటుంబంలో పుట్టిన గోపాల్ చిన్నతనంలోఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదు ర్కొని కష్టపడి చదివి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. అనంతరం విధి నిర్వహణలో ఎన్నో ఆటుపోట్లు ఎదు ర్కొని ప్రాణాలకు తెగించి పోలీసు ఉన్నత అధికారులచేత ప్రశంసలు పొందారు. మంచి క్రమశిక్షణతో తోటి ఉద్యోగ స్తులకు తలలో నాలుకలా మెలిగి ప్రజా క్షేత్రంలో ఫ్రెండ్లీ పోలీసుగా గుర్తింపు పొందిన గోపాల్ 37 సంవత్సరాల తర్వాత గురువారం ఐజి తరుణ్ జోష్ పోలీసు ఉన్నతా ధికారుల నేతృత్వంలో షాద్నగర్ ఫ్యాబ్ సిటీ డిసిపి శిరీష రాఘవేందర్ కరకమలములచే రెండవ స్టార్ పొంది ఎస్ఐ గా ప్రమోషన్ పొందారు.

తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వ ఫలాలు అందజేయాలి

-తెలంగాణ ఉద్యమకారుడు కె శ్రీనివాస్

వికారాబాద్, ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమంలో ఉద్యమమే ఉద్యోగంలా పనిచేసిన క్రియాశీలక ఉద్యమ కారులను గుర్తించి ప్రభుత్వ ఫలాలు అందజేయాలని తెలంగాణ ఉద్యమకారుడు కే.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో తెలంగాణ ఐక్య కార్యాచరణ కమిటీ, వికారాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల సమావేశం శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమ సమయంలో ఎంతోమంది మేధావులు ఉద్యమనాయకులకు వెన్నంటి ఉండి పూర్తి స్థాయిలో ఉద్యమాన్ని ముందుకు సాగించారని గుర్తు చేశారు. వికారాబాద్ గడ్డ అంటే ఉద్యమాల గడ్డ అనే విధంగా ఉద్యమాన్ని ఉస్మానియా తరహాలో నడిపించారని తెలిపారు. జూన్ 2 వ తేదీన జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అందరూ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్దకు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఆ రోజు అమరవీరులకు నివాళులు అర్పించి, శాసన సభాపతి ప్రసాద్ కుమార్‌కు ఉద్యమకారుల సమావేశం ప్రతిపాదనలు అందజేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, స్థానిక శాసనసభ్యులు తెలంగాణ శాసన సభాధిపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లు తప్పకుండా ఉద్యమకారుల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటారని అభిప్రాయ పడ్డారు. సమావేశంలో ఉద్యమ నాయకులు బైండ్ల విజయకుమార్, ఎమ్.సురేష్, రవిశంకర్, గంగ్యా నాయక్ (పరిగి),కే .భాను (తాండూరు), టి.రామ చందర్,శివకుమార్ రెడ్డి, శాంత్ కుమార్, దేవదాస్, మారుతి, బుస్స శ్రీకాంత్, బాలరాజు నాయక్, టి.శంకర్, కే.అంజయ్య,సమద్, జాకీర్, బి.కృష్ణయ్య ,పలువురు అధ్యాపకులు,విద్యార్థి నాయకులుపాల్గొన్నారు.

పేదల బతుకులను తవ్వేస్తున్నారు

మొయినాబాద్, మే 29, ప్రభాతవార్త : సమాజంలో మనిషికి ఏది లేకపోయినా కూడు, గుడ్డ, నీడ అవసరమనే విషయాన్ని గుర్తించిన అప్పటి టిడిపి ప్రభుత్వం నిరుపేదలకు 110 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించి సుమారు 300 మందికి పట్టాలు ఇచ్చింది. అయితే ఇప్పుడు హైదరాబాద్ - బీజాపూర్ నేషనల్ హైవే నిర్మాణ పనుల పేరుతో ఆ స్థలాలను మేఘ కన్స్రక్షన్ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా తవ్వేసి, ఇళ్ల నిర్మాణానికి పనికిరాకుండా చేస్తున్నారని కనకమామిడి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మొయినాబాద్ తాసిల్దార్ గౌతమ్ కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

వివరాల్లోకి వెళితే.. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 51/1లో 1998 సంవత్సరంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక్కొక్కరికి 110 గజాల చొప్పున 300 మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పట్టాదారులు తమ స్థలాలను అలాగే ఉంచుకున్నారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి ఇళ్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చి శిలాఫలకం కూడా ఏర్పాటు చేశారు. కానీ అనివార్య కారణాల వల్ల ఆ హామీ అమలు కాలేదు. దీంతో ఎప్పటికైనా ప్రభుత్వం ఇళ్లు నిర్మించుకునేందుకు సాయం చేస్తుందనే ఆశతో పట్టాదారులు ఎదురు చూస్తున్నారు.ఇదే సమయంలో హైదరాబాద్ టు బీజాపూర్ హైవే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. హైవేకు ఆనుకొని ప్రభుత్వ భూములు ఉండటంతో కనక మామిడి గ్రామంలోని కొందరు రియల్ వ్యాపారుల కన్ను ఈ భూములపై పడిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అధికారుల అనుమతులు లేకుండానే హిటాచీలు, జేసీబీలు, లారీల సహాయంతో నిరుపేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాల్లో పెద్ద ఎత్తున మట్టి తవ్వకాలు జరిపి భూమిని గుంతలమయం చేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కొంతమంది గ్రామస్తులు తవ్వకాలపై ప్రశ్నిం చగా, మాజీ ఉపసర్పంచ్ కుమారుడు ఇది ప్రభుత్వ స్థలం.. మీ దగ్గర ఏమైనా కాగితాలు ఉన్నాయా.. మేము ఇలాగే తవ్విస్తాం.. మీ దిక్కున చెప్పుకోండి" అంటూ దురుసుగా మాట్లాడినట్లు బాధితులు ఆరోపించారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో నుంచి 40 ఫీట్ల రోడ్డు నిర్మాణానికి కొందరు రియల్ వ్యాపారులు, కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ దారుణాన్ని అడ్డుకోవాలని, తమ ఇండ్ల స్థలాలను రక్షి ంచాలని బాధితులు మండల రెవెన్యూ అధికారులను వేడుకుంటున్నారు.తాసిల్దార్ గౌతమ్ కుమార్ వివరణ..హైదరాబాద్ - బీజాపూర్ హైవే నిర్మాణ పనుల కోసం మేఘ కన్స్రక్షన్ వారికి కనకమామిడి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 510 మొత్తం విస్తీర్ణం సుమారు 562 ఎకరాలు, 51లో మొత్తం విస్తీర్ణం 82 ఎకరాలు ఈ సర్వే నంబర్లలో నుండి సుమారు 20 ఎకరాల వరకు వాహనాల డంపింగ్, తవ్వకాల కోసం అనుమతులు ఇచ్చినట్లు తెలిపారు. అయితే అనుమతులకు మించి తవ్వకాలు జరుగుతున్నాయని గ్రామస్తులు వినతిపత్రం ఇచ్చారని పేర్కొన్నారు.స్థలాన్ని స్వయంగా పరిశీలించిన తర్వాత ప్రభుత్వం అనుమతించిన పరిమితికి మించి తవ్వకాలు జరిగి ఉంటే, నిరుపేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాల్లో మైనింగ్ చేసినట్లు తేలితే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ అనుమతులు లేకుండా 40 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేపడుతున్న రియల్ వ్యాపారులపై కూడా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ బాధితులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేయాలని సూచించారు. పోలీసు శాఖ వారు పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని తద్వారా కమిషన్ వారికి పురోగతి కనిపిస్తుందన్నారు. జిల్లాలో ఒకరే పిపి ఉండటం వల్ల అభిప్రాయాలకు ఎక్కువ సమయం పడుతుందని, మరొక పిపిని నిర్ణయించ టానికి కమిషనర్ వారు, డివిఎంసి కమిటీ ద్వారా తగిన చొరవ తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి మూడు నెలలకు ఓ సారి డివిజన్ స్థాయిలో సమీక్ష నిర్వహించి పెండింగ్‌లో ఉన్న కేసులను క్లియర్ చేయాలని ఆయన సూచించారు. సఫాయి కర్మ చారిలకు అందించే పిపి ఈకిట్స్, ప్రొటెక్ట్ కిట్లను క్రమం తప్పకుండ అందించేందుకు మున్సిపల్ కమిషనర్లు, జోనల్ కమిషనర్లుకు కలెక్టర్ ద్వారా లేఖలు అందజేస్తా మన్నారు.డివిఎంసి సమావేశంలో మినిట్స్ ప్రకారం పెండింగ్ కేసుల వివరాలను పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సమీక్షించారు. దీనిలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మెంబర్ జిల్లా శంకర్ మాట్లాడుతూ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాను రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ దత్తత తీసుకుందని అన్నారు. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో త్వరితగతిన న్యాయం చేకూరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం వెంటనే అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కేసులకు సంబంధించి కుల ధృవీకరణ పత్రాలను సకాలంలో అందించాలని జాప్యం చేయవద్దని అధికారులకు సూచించారు.క్లిష్టమైన సమస్యలు వస్తే కమిషన్ దృష్టికి తీసుకవస్తే తమ వంతు సహకారం అందించి ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరిస్తామన్నారు. ఇటీవల అద్రాస్‌పల్లి గ్రామంలో జరిగిన శ్రీరామనవమి కల్యాణ కార్యక్రమంలో కొందరు దళితులకు ఆలయ ప్రవేశం కల్పించకపోవటం వంటి సంఘటనలు జరిగాయని, దానికి కమిషన్ పాల్గొని ఇరువర్గాల ప్రజలతో మాట్లాడి ఒకరినొకరు గౌరవించుకుని పండుగలు సాంప్రదాయపద్దతిలో జరుపుకోవాలని నిర్ణయించి, ముగ్గురిపై నమోదు చేసిన అట్రాసిటీ కేసులను కూడ వెనక్కి తీసుకునేలా చేశామని, దీనిలో పోలీసు వారి పాత్రకీలకమైందన్నారు.

ప్రజా ఫిర్యాదులపై మరింత స్పందన చూపండి

షాబాద్, మే 29, ప్రభాతవార్త : శాంతిభద్రతలు, స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఫ్యూచర్ సిటీ సిపి డాక్టర్ తరుణ్ జోషి అన్నారు. ఫ్యూచర్ సిటీ సిపి డాక్టర్ తరుణ్ జోషి గురువారం షాబాద్ పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించిన కమిషనర్, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడి స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యాదులను అత్యంత మర్యాదపూర్వకంగా స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా విని చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా సమయపాలనతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు.స్టేషన్ పరిసరాలను పరిశీలించిన కమిషనర్ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిపి యోగేష్ గౌతమ్, ఏసిపి కిషన్, షాబాద్ పోలీస్ స్టేషన్ సిఐ కాంతారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణపై జిహెచ్ఎంసి అవగాహన

జవహర్ నగర్, మే 29, ప్రభాత వార్త: మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు కీసర సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వసంత ఆధ్వర్యంలో శుక్రవారం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో "ఫ్రైడేడ్రైడే" దోమల నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కీసర సర్కిల్ పరిధిలోని చంద్రపురి కాలనీ డివిజన్ చెన్నాపురంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమ పుట్టకుండా దోమ కుట్టకుండా అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రత పాటించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ భాస్కర్, తిరుపతి రాజు, వార్డ్ ఎంటమాలజీ సూపర్వైజర్లు శ్రీనివాస్, స్వామి, కాలనీ అసోసియేషన్ సభ్యులు మరియు ఎంటమాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

-- తాండూరులో యూత్ కాంగ్రెస్ నేతల నిరసన

నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

తాండూరు, మే 29, ప్రభాతవార్త : కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని యూత్ కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ఇందిరాచౌక్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ తాండూరు నియోజకవర్గ అధ్యక్షులు తుపాకుల అనిల్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమేర్ అబ్దుల్లా, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కావలి సంతోష్ కుమార్, పట్టణ అధ్యక్షులు బాతుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డిజీల్ ధరలను పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని మండిపడ్డారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, అనిల్, సుధాకర్, సతీష్, మహేష్, సందీప్ రెడ్డి, శ్రీహరి, మాణిక్, రఫీక్, నవీన్, జగదీష్, తేజ, సునీల్, రామకృష్ణ, సురేష్, సుధీర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యువత పొగాకుకు దూరంగా ఉండాలి

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా వైద్యాధికారి చంద్రకళ

కీసర,మే29,ప్రభాతవార్త:యువత పొగాకుకు దూరంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి చంద్రకళ అన్నారు. శుక్రవారం కీసర సర్కిల్ 1 పరిధిలోని కీసరలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువకులు, పిల్లలు, మహిళలు వికలాంగులు, వయోవృద్ధులు ఎవ్వరు మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని పిలుపునిచ్చారు. చిన్న వయస్సులో కొంతమంది యువకులు, విద్యార్ధులు మత్తుపదార్థాల బారిన పడుతుండటం బాధాకరమన్నారు. కష్టపడి చదివి ఎంతోమందితో పోటీపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని, మంచి భవిష్యత్తు ఉన్న అలాంటి విద్యార్ధులు ఈ మధ్యకాలంలో మత్తు పదార్ధాల బారిన పడటం శోచనీయమన్నారు. జీవితంలో ఎన్నో సమస్యలు ఒడిదుడుకులు వస్తాయని, ప్రతి సమస్యకు పరిష్కార మార్గం కూడా ఉంటుందని గుర్తు చేశారు. డ్రగ్స్ బారిన పడటం వారి జీవితాన్ని మాత్రమే కాకుండా మొత్తం కుటుంబాన్ని నాశనం చేస్తుందని హెచ్చరించారు. ఒకసారి మత్తు బారిన పడినవారు బయట పడటం అంత తేలికైన విషయం కాదని జీవితాన్ని నాశనం చేసే వరకు వదలదని అన్నారు. చెడు వ్యసనాలను, చెడు మార్గాలు చూపే స్నేహితులను తక్షణమే వదిలేయాలని సూచించారు. మంచి స్నేహితుల తో, కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సంతోషాన్ని పొందాలని సూచించారు. ధ్యానం, యోగా వంటివి అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మంజులరెడ్డి, ఆశ కార్యకర్తలు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారం

జిల్లెడు చౌదరిగూడ, మే 29,(ప్రభాతవార్త): జిల్లేడు చౌదరిగుడా

పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేకర్

మండల పరిధిలోని ఎదిర గ్రామంలో తాగునీటి సమస్యను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పరిష్కరించారు. గ్రామంలో నీటి సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెల్లడంతో వెంటనె స్పందించిన ఆయన నీటి సమస్య పరిష్కారం కోసం కిలోమీటరు పైప్‌లైన్‌కు నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా పైప్‌లైన్ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగిన వెంటనే అవసరాన్ని తీర్చి గ్రామ స్తుల ఇబ్బందులు నివారించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల విజయలక్ష్మి మ్మ, డిప్యూటీ సర్పంచ్ గొడుగుని పల్లి భాస్కర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు జక్కని రవికుమార్, , దామోదర్ రెడ్డి, జాంగిర్, సుధాకర్ గౌడ్, చక్కని భీమ్ రాజ్, పాపయ్య, వార్డు సభ్యుడు బుడమోల కృష్ణయ్య, రాపోలు రాములు, మొగులయ్య, బైండ్ల బాలరాజ్, మురుగని రాములు, చౌడాపూర్ మల్లయ్య, ఎండి చాంద్ పాషా, వద్దే గోపాల్, నరేష్, సురేష్, కావాలి నర్సింలు, రిషి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి సంస్థాగత నిర్మాణంపై చర్చ

షాద్‌నగర్, మే 29, ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా బిజెపి "పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహ అభియాన్" కార్యక్రమం జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ అధ్యక్షతన రెండవ రోజు ప్రగతి రిసార్ట్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గౌతమ్ రావు గారు పార్టీ సంస్తాగత నిర్మాణము పై పలు అంశాలు చర్చించడం జరిగింది. ఈకార్యక్రమంలో షాద్ నగర్ నియోజకవర్గం నుండి రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, మాజీ మండల అధ్యక్షులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రధానం

విజేతలకు బహుమతులు అందజేస్తున్న మంత్రి శ్రీహరి ,ఎమ్మెల్యే వీర్లపల్లి

కేశంపేట, మే 29, ప్రభాత వార్త: కేశంపేట మండల కేంద్రంలోని ఎడిట్ జోన్ ప్రాథమిక పాఠ శాలలో ఫుట్బాల్ టోర్నమెంట్ ముగింపు వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి క్రీడా మరియు యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ముఖ్య అతిథిగా ఈ సందర్భంగా క్రీడలలో గెలుపొందిన విజేతలకు ఆయన చేతుల మీదులుగా బహుమతులు మరియు ప్రశాంత పత్రాలను అందిం చారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి ముదిరాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే విద్యతోపాటు క్రీడల పట్ల అవగాహన ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహద పడతాయని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉన్న క్రీడాకారులను వెలికి తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని ఆయన అన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ స్థాయి క్రీడాకారులు సద్వినియోగించుకొని జిల్లా రాష్ట్రస్థాయి నేషనల్ స్థాయికి చేరుకోవాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమం దృష్ట్యా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సముచిత న్యాయం కల్పిస్తుందని నిరుపేదలైన విద్యార్థులకు అనేక రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టిన కారు

ధారూర్,మే 29, ప్రభాత వార్త: మండల పరిధిలోని ఘోర రోడ్డు ప్రమాదం శుక్రవారం చోటుచేసుకుంది. అతివేగంగా వచ్చిన ఒక కారు మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొట్టడంతో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూర్ మండల పరిధిలోని కుక్కింద జడ్.పి.హెచ్.ఎస్ స్కూల్ సమీపంలో ధర్మాపూర్ వైపు నుంచి పల్సర్ బైక్(టీ ఎస్ 34 ఫ్ 9115)పై వెళ్తున్న దోర్నాల్ గ్రామానికి చెందిన మహేష్, అస్లాం, ప్రవీణ్ అనే ముగ్గురు యువకులను, అన్నాసాగర్ నుండి వికారాబాద్ వైపు అతివేగంతో దూసుకొచ్చిన స్విఫ్ట్ డిజైర్(టీ ఎస్ 34 కె 5694)కారు బలంగా ఢీకొట్టింది. కోటపల్లి మండలం అన్నాసాగర్‌కు చెందిన జక్కపల్లి సందీప్ అనే వ్యక్తి ఈ కారును నడుపుతున్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన బాటసారులు వెంటనే స్పందించి, అత్యవసర చికిత్స వాహనం సహాయంతో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి విచారించారు. అయితే ఈ ప్రమాదంపై స్థానిక సబ్ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరగా, బాధితుల నుండి తమకు ఇప్పటివరకు ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అందలేదని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఒకటి పరిస్థితి విషమంగా ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు .

చందాలతో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను నిర్మించిన గ్రామస్తులు

కండ్లకోయలో డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను నిర్మిస్తున్న నాయకులు

మేడ్చల్, మే 29, ప్రభాతవార్త : నెలల తరబడి డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న కండ్లకోయ గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు స్వయంగా చందాలు సేకరించి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పునర్నిర్మించుకున్నారు. గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధికండ్లకోయ గ్రామంలోని మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహం వెనుక ప్రాంతంలో ఉన్న ప్రధాన డ్రైనేజీమ్యాన్‌హోల్ గత ఆరు నెలలుగా మూసుకుపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి పొంగిపొర్లుతూ దుర్గంధంగా మారింది. సమస్య కారణంగా దుర్వాసన, దోమల బెడద పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురయ్యారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులు, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో సమస్యను పరిష్కరించుకునేందుకు గ్రామస్తులు, స్థానిక నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. చందాలు సేకరించి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను పూర్తిగా శుభ్రపరచడమే కాకుండా దెబ్బతిన్న భాగాలను మరమ్మత్తులు చేసి పునర్నిర్మించారు. గ్రామస్తుల శ్రమదానం, స్థానిక నాయకుల సహకారంతో చేపట్టిన ఈ పనుల ద్వారా డ్రైనేజీ నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో నెలలుగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు తాత్కాలిక ఉపశమనం లభించింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం బాధాకరమన్నారు. ప్రజల ఆరోగ్యం, భద్రతకు సంబంధించిన సమస్యను సైతం పట్టించుకోకపోవడంతో గ్రామస్తులే తమ సొంత నిధులతో మ్యాన్‌హోల్‌ను పునర్ని ర్మించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కండ్లకోయ గ్రామంలోని డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ నాయకుడు ఎస్. రాజేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు హరికృష్ణ, ప్రవీణ్ మహేందర్, గ్రామ యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

రెండోసారి పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్మన్ కేశవరెడ్డి

తలకొండపల్లి ,మే 29, ప్రభాత వార్త: తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో శుక్రవారం నాడు పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని పునప్రారంభించారు. గత ఏప్రిల్ నెలలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా పడకల్లో ప్రారంభించినప్పటికీ గత రెండు మూడు రోజులకే కొనుగోలు కేంద్రాన్ని మూసివేశారు. దాంతో ఇక్కడ రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో సింగల్ విండో ఛైర్మన్ గట్ల కేశవరెడ్డి చొరవ తీసుకొని రాష్ట్ర వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు పార్లమెంట్ సభ్యులు మల్లు రవి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డితో కలిసి రైతుల పరిస్థితిని వివరించారు. రంగారెడ్డి జిల్లాలోని తలకొండపల్లి మండల పరిధిలోని పరిసర గ్రామాలలో పొద్దు తిరుగుడు పంటను రైతులు అధికంగా పండిస్తున్నారని రైతుల మేలు కోసం కేంద్రాన్ని మళ్లీ ప్రారంభించాలని కోరడంతో అధికారుల నాయకుల సూచన మేరకు శుక్రవారం సింగల్ విండో ఛైర్మన్ గట్లకేశవరెడ్డి రెండవసారి ప్రొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగల్ పిండ ఛైర్మన్ గట్ల కేశవరెడ్డి మాజీ సర్పంచ్ రాములు మాజీ ఎంపిటిసి జో రమేష్, లట్టుపల్లి రమాదేవి స్వామి చెన్నయ్య మల్లేష్ జితేందర్ రెడ్డి తదితరులున్నారు.

హైదరాబాదులో ఆంధ్రుల విగ్రహాలు తొలగించాలి

జెఏసి విద్యార్థి సేన అధ్యక్షుడు టికె శివప్రసాద్ ఆగ్రహం

షాద్‌నగర్, మే 29, ప్రభాతవార్త : తెలంగాణ వ్యాప్తంగా సకల జనులు ఏకమై, ఎంతోమంది ప్రాణాలు అర్పించి సాధించిన తెలంగాణ స్వార్థపరుల కుట్రలతో వచ్చింది అంటూ తెలుగుదేశం మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆరోపించడం అత్యంత దారుణమని ఓయూ జేఏసీ విద్యార్థి సేన అధ్యక్షుడు టీకే శివప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మహానాడులో మాజీ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీకృష్ణ కమిటీ షాద్ నగర్ వెళితే తెలంగాణ వద్దు అని లేఖ రాసిచ్చిన ఘనుడు మాజీ ఎమ్మెల్యే అని విమర్శించారు. అప్పుడు చంద్రబాబు ఈయన కోసం ప్రత్యేకంగా శాలరీ ప్రవేశపెడితే ఇప్పటిదాకా దాని మీద బతుకుతున్నాడని ఆరోపించారు.

పొలిట్ బ్యూరో సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షులు అని చెప్పుకునే మాజీ ఎమ్మెల్యే తన స్వగ్రామంలో పార్టీ తరఫున సర్పంచ్ అభ్యర్థిని నిలబెడితే 50 ఓట్లు కూడా రాలేదని ఎద్దేవా చేశారు. తెలంగాణ స్వార్థపూరిత నాయకులతో వచ్చిందని మాజీ ఎమ్మెల్యే అంటున్నారని, ఎవరు స్వార్థపరులు.. కొండా లక్ష్మణ్ బాపూజీ, కాళోజి, ఆచార్య జయశంకర్లు స్వార్థపరులా..? తెలంగాణ కోసం ఎంతో మంది యువకులు తమ ప్రాణాలను అర్పించారు.. వాళ్లు స్వార్థపరులా..? అంటూ ప్రశ్నించారు. తెలంగాణ లక్ష్యంగా ఓయూ జేఏసీగా ఏర్పడి ప్రాణాలకు తెగించి పోరాడిన విద్యార్థులు స్వార్థపరులు అవుతారా.. మాజీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ పరువును ఆంధ్రోళ్ల దగ్గర తాకట్టుపెట్టే పనులను మానుకోవాలని హితువు పలికారు. ఎందరో పోరాటం చేసిన ఫలితంగా 13 ఏళ్ల కింద తెలంగాణ వచ్చిందని, కానీ నేటికీ తెలంగాణ వ్యతిరేక శక్తుల ఆనవాళ్లు ఇక్కడ కనిపించడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ నడిబొట్టున ఎన్టీఆర్ విగ్రహం ఎందుకు..? తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డులో అమీర్పేటలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కారణం ఏమిటో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని వై జేపీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు టికె శివప్రసాద్ ప్రశ్నించారు. ఇది తెలంగాణ అమరవీరులను అవమానపరచడమేనని ఆయన అన్నారు.

విగ్రహాలు పెట్టదలుచుకుంటే కొండా లక్ష్మణ్ బాపూజీ, కాళోజీ, జయశంకర్ లాంటి వాళ్ల విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఇది తెలంగాణ విలువలను ఆంధ్రుల ముందు తాకట్టు పెట్టడమేనని పేర్కొన్నారు. ఒకవైపు మద్దతు ధర లేక రైతులు అల్లాడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఆంధ్రుల విగ్రహాలు పెట్టి నవ్వుకుంటున్నారని పెద్దవా చేశారు. వెంటనే తెలంగాణ నుంచి ఆంధ్ర వాళ్ళ విగ్రహాలను తొలగించాలని ఓయూ జేఏసీ విద్యార్థి సంఘం నుంచి డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. లేదంటే మిలియన్ మార్చ్ తరహాలో ఉద్యమించి కామే ఆ విగ్రహాలను తొలగించి కృష్ణ నదిలో పారవేస్తామని, నేరుగా అవి అమరావతికి చేరుకుంటాయని స్పష్టం చేశారు. తెలంగాణ పరువుకు ఎవరు భంగం కలిగించిన సహించేది లేదని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లు వేగవంతంగా పూర్తి చేయాలి

ఎంపిడిఓ రామకృష్ణ నాయక్

కుల్కచర్ల,మే,29 ప్రభాతవార్త:ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లు వేగావంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ గ్రామ రైతు వేదికలో జరుగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లనుసర్పంచ్ చంద్రభూపాల్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు పరిశీలిస్తున్న సర్పంచ్, ఎంపిడిఒ

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి

సర్పంచ్ నరసిహులు యాదవ్

కుల్కచర్ల,మే,29 ప్రభాతవార్త: మురుగునీటికి కోసం ప్రతి ఇంటికి ఇంకుడుగు గుంత తప్పనిసరి ఏర్పాటు చేసుకోవాలని ఎంపిడిఓ రామకృష్ణ నాయక్, సర్పంచ్ నరసిహులు యాదవ్, పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోనిరాంరెడ్డిపల్లి గ్రామంలో మురుగునీటిని పరిశీలించారు. అనంతరం ఇంకుడు గుంతల ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షపు నీటిని మురునీరుని ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంపొందించడానికి ప్రతి ఇంటికిఇంకుడు గుంత తప్పనిసరి అన్ని సూచించారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం ఇంకుడు గుంతలు ఉండడం అత్యవసరమని అన్నారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రాంపూర్‌లో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి

రైతుల దగ్గర మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

తలకొండపల్లి ,మే 29, ప్రభాత వార్త: రంగారెడ్డి జిల్లాలోని రైతుల దగ్గర ఉన్న మొత్తం వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంత మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం నాడు రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి, మాడుగుల ఆమనగల్ మండలాల్లో నీ ఆయా గ్రామాల రైతుల వద్దకు వెళ్లి వరి ధాన్యాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా రైతుల ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒకవైపు రైతు నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేస్తున్నామని తెలుపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలు మూసివేశారని ఆయన విమర్శించారు. తలకొండపల్లి మండల పరిధిలోని జంగారెడ్డిపల్లి రాంపూర్ వెల్జాల్ గ్రామాల్లో రైతులతో ఆయన ముచ్చటించారు. అనంతరం కొంతమంది రైతులతో సభ్యత కార్యక్రమం పూర్తిచేసి రైతులను నిర్దేశించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంపూర్ గ్రామంలో ఒక వారం రోజులుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గత మూడు రోజులుగా కొనుగోలు కేంద్రాన్ని మూసివేశారని, దాంతో వరి ధాన్యాన్ని కళ్ళల్లో ఎండబోసి రైతులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులందరికీ డబ్బులు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ దమన నీతిని ఎండగడతామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కొంతం మాధవరెడ్డి, రెడ్డి సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు చిన్న హరి మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు విజయ్, నరేందర్ రెడ్డి, ప్రసాద్, రామచందర్ ,తో పాటు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

వార్డు సభ్యురాలు భర్తకు ఆర్థిక సాయం

తలకొండపల్లి ,మే 29, ప్రభాత వార్త: తలకొండపల్లి మండల పరిధిలోని లింగరావుపల్లి గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ వార్డు సభ్యురాలు బొచ్చుపల్లి లక్ష్మీ ్మదేవి భర్త వెంకటయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వెంకటయ్యను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వ్యక్తిగతంగా చికిత్స కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత వేసవికాలంలో ఎండలుతీవ్రంగా మండుతున్నాయని ప్రజలందరూ ఆరోగ్య పరిస్థితుల్లో నిష్ట ఉదయం వేళలోనే పనులకు వెళ్లాలని మధ్యాహ్నం సమయంలో ఇట్టి పరిస్థితుల్లో బయటికి వెళ్లకూడదని ఆయన సూచించారు. ముఖ్యంగా పిల్లలు వృద్ధులు బయట తిరగకుండా జాగ్రత్త తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య వార్డు సభ్యులు బాచుపల్లి లక్ష్మీ ్మదేవి రాములు చెన్నయ్య రబ్బాని ప్రసాద్ ఈ కార్యక్రమంలో లింగరావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య వార్డు సభ్యులు బాచుపల్లి లక్ష్మీ ్మదేవి రాములు చెన్నయ్య రబ్బాని ప్రసాద్ తదితరులున్నారు.

బుక్కీపరుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి

తలకొండపల్లి ,మే 29, ప్రభాత వార్త: రాష్ట్రంలో కొన్ని సంవత్సరాలుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న బుక్కీపరుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కలకొండపల్లి సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్ అన్నారు. శుక్రవారం నాడు తలకొండపల్లి మండలకేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో గత కొన్ని రోజులుగా బుక్ కీపరులు చేస్తున్న సమ్మెకు ఆయన మద్దతు పలికారు. ఈ సందర్భంగా శేఖర్ యాదవ్ మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా ఆయా గ్రామాలలోని బుక్కీపరులందరూ సమస్యల పరిష్కారంకొరకు శాంతి యుతంగా తమ డిమాండ్ల సాధన కొరకు ధర్నా నిర్వహిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. ఎంతోమంది ఆయా గ్రామాల్లో నిరుపేదలైనా బుక్కీపరులో తమ సమస్యలపై ప్రభుత్వానికి వెలిబుచ్చే విధంగా సోమబాట పట్టిన పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. బుక్కీపరుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, ఉద్యోగులకు లభించే విధంగా బుక్కీపరులకు బెనిఫిట్స్ అందజేయాలని, వారికి సరిపోను కనీస వేతనం అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, రాంపూర్ సర్పంచి వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ వెంకట్రావుపేట సర్పంచ్ ఇమ్మడి మహేష్‌తోపాటు ఆయా గ్రామాల బుక్కీపరులు తదితరులు ఉన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగపరుచుకోవాలి

తలకొండపల్లి ,మే 29, ప్రభాత వార్త: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందించే సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోపరచుకోవాలని మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని అన్నారు. శుక్రవారం నాడు తలకొండపల్లి మండల కేంద్రంలోని ఆగ్రో సేవా రైతు కేంద్రంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు శేఖర్ యాదవ్‌తో కలిసి రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సబ్సిడీపై పచ్చి రొట్టె ఎరువులు అయినా జనుము, జిలుగు విత్తనాలను సబ్సిడీపై అందజేశారు.

50 సబ్సిడీపై జనుము 40 కిలోల బ్యాంకు 7775, జిలుగు విత్తనం క్వింటాల్కు సబ్సిడీపై 8175 రూపాయలు చొప్పున కావలసిన రైతులు చెల్లించి తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా రేణుక చక్రవర్తిని మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలలో అధికంగా రసాయన ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గి పంట దిగుబడులు క్షీ ణిస్తున్నాయన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ఈ పచ్చి రొట్టె ఎరువులు అయినా జనుము, జిలుగు వాడకం ద్వారా నేలలో జరిగి తీవ్ర సైనిక చర్యలు జరుగుతుందని, కలుపు మొక్కల పెరుగుదలను కూడా నియంత్రిస్తుందని అందువల్ల రైతులు ఈ సబ్సిడీ విత్తనాల అవకాశాన్ని సద్వినియోపరుచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తిని, సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్, ఏఈవోలు శ్రీనాథ్ లలిత సుస్మిత రైతులు తదితరులు ఉన్నారు.

రుణాలు తీసుకొని అభివృద్ధి చెందండి!

కొందుర్గు, మె 29, ప్రభాతవార్త: మండల మహిళా సమైక్య ద్వారా బ్యాంకు సహకారంతో రుణాలు తీసుకొని మహాలక్ష్మి ్మ సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఇన్చార్జ్ ఎంపిడిఒ గణపతి కోరారు.

ప్రజా పాలన ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా వారోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం నాడు స్థానిక మండల పరిషత్ మీటింగ్ హాల్లో లోన్ మేళా కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఎంపీడీవో గణపతి ఏ. పి. ఎం హరిలాల్ తో కలిసి బ్యాంకు లీకేజీ ద్వారా 44 సంఘాలకు గాను మూడు కోట్ల 30 లక్షల జంబో చెక్కు, సీఎం కింద నాలుగు వివో లకు 10 లక్షల రూపాయల చెక్కులను ఇచ్చి లోన్ మేళా ఉత్సవాల సంబరాలను ప్రారంభించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ చిన్న సంఘాలు ఈ రుణాలను తీసుకొని ఆర్థికంగా పురోగతి సాధించాలని అప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సర్పంచులు, మండల సమాఖ్య సిబ్బంది, గ్రామాల బుక్ నిర్వాహకులు, మండల మహిళా సమాఖ్య కార్యవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

కుల్కచర్ల,మే,29 ప్రభాతవార్త: నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటామని బిఆర్ఎస్ సియర్ నాయకులు వెంకటేష్ అన్నారు. మండల ఘణపూర్ గ్రామ పంచాయతీకి చెందిన ల్యాగల భీమమ్మ ఆనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసున్నబిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాయకులతో కలిసి భీమమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కటుంబాని పరమర్శించించి అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేలు ఆర్థిక సాయం చేశారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ నియర్ నాయకులు వెంకటేష్ మాట్లాడుతూ.. నిరుపేదలను అదుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.